# 1. అమెరికా మజిలీ కథలు

ఈ కథలకి ఉపోద్ఘాతం

కథా ప్రారంభం

మొదటి మజిలీ :

1. స్కాలర్ షిప్పులు
2. పరిశోధనా చౌర్యం

రెండో మజిలీ :

3. అచ్చువేయుము లేక చచ్చుము

మూడో మజిలీ :

4. కిట్టించని సత్య హరిశ్చంద్రుడు
5. తిరిగొచ్చిన థీసిస్

నాలుగో మజిలీ :

6. రాతిఫలకం
7. ఇండియన్ పిహెచ్.డి.

ఐదో మజిలీ :

8. లాబ్ చరిత్ర

చివర మజిలీ :

9. డాక్టరు పుల్లాయి తిరుగు ప్రయాణం

ఉపసంహారం

## ఈ కథలకి ఉపోద్ఘాతం

ఇండియాలో ఉన్న బ్రెయిన్లన్నీ పైదేశాలకి షికార్లెళ్తున్నాయని ఈ మధ్య దేశంలో చాల దుమారం రేగుతోంది. అయితే షికార్లెళ్ళే వన్నీ బ్రెయిన్లు కావని వెళ్ళనివి కాక పోలేదని కొందరంటున్నారు. ఇవి డ్రెయి నవటానికి ప్రయత్నించి చేతకాక క్లాగ్ అయిపోయిన బ్రెయిన్ల స్వంతదార్ల కిట్టని మాటలని మొదటి వర్గం వారంటున్నారు.

ఏది ఎట్లా అయినా బ్రెయిన్ల జాతి అభివృద్ధి చెందటానికి సరియైన వాతావరణం లేదంటారు ఇండియాలో. ఆ సరిగ్గా లేని వాతావరణాన్ని చిత్రించడాని కిందులో ప్రయత్నం జరిగింది. భారతీయుల కతిశయోక్తు లంటే ఇష్టం కనుక అవి కొన్ని అక్కడక్కడ ఇందులో వాడబడ్డాయి గాని పూర్తిగా కాదు. దేశంలో సర్వసాధారణంగా కనిపిస్తున్నవి మాత్రమే రాశాను గాని ఎవరినీ మనస్సులో పెట్టుకుని రాయలేదని సవినయంగా మనవి చేస్తున్నాను.

- రచయిత

ఆర్థర్ హెయిలీ వ్రాసిన 'ఎయిర్ పోర్ట్', 'హోటల్' అన్న నవలలూ, తెలుగులో కొమ్మూరి వేణుగోపాలరావు వ్రాసిన 'హౌస్ సర్జన్' నవల వంటివి ప్రత్యేకమైనవి. ముళ్ళపూడి వారి 'రాజకీయ బేతాళ పంచవింశతి' హాస్య ధోరణిలో వ్రాసిన ప్రత్యేకమైన రచన. రాజకీయాల్లో వ్యక్తుల ప్రవర్తన, అందులోని ఎత్తులూ - పై ఎత్తులూ, వాటి యదార్థ చిత్రణే ప్రధానం. హాస్యం హాస్యం కోసం కాదు. ప్రయోజనం కోసం అన్నమాట. అలాంటివే 'బ్రెయిన్ డ్రెయిన్' కథలు కూడా! 'ఇవి సామాన్య పాఠకులకి నచ్చుతాయా, లేదా?' అని ఒక సంపాదకుడు లేవదీసిన సందేహానికి ఆస్కారమే లేదు! శ్రీ శర్మగారి రచనలో క్లిష్టమైన విషయాన్ని సుగమం చెయ్యడమే కాకుండా, దాన్ని ఆకర్షణీయంగా చేసే ప్రతిభ కూడా వ్యక్తమవుతున్నది. శర్మగారిలాంటి వెన్ని కథలు వ్రాసినా, పాఠకులు ఇంకా కావాలనే అంటారు. సందేహం లేదు!

ఆర్.యస్. సుదర్శనం

# కథా ప్రారంభం

సిద్ధయ్యగారికి వో వందెకరాల మాగాణి, పంచాయితీలో పలుకుబడి, మంత్రులతో స్నేహాలు కాకుండా మణి అనే చిన్నది, గోపన్న ఉరఫ్ గోపాల్రావ్ అనబడే మేనల్లుడు ఉన్నారు. పొలంలో స్వంత వ్యవసాయం చేస్తున్నా అయన రాజకీయాల్లో స్వంత వ్యవసాయం చెయ్యడు. అయన గెల్చినోడి పార్టీ. అందుకని తనకి పార్టిలెస్ డెమోక్రసీ అంటే ఇష్టమనీ తను శ్రీ గోరా శిష్యుడననీ చెప్పుకుంటాడు. అవతలవాడి పక్షమే మాట్లాడుతూ తన మాట నెగ్గించుకోవటం ఆయన ప్రత్యేకత. ఆయన పద్లీగ్గా ఒప్పుకోని మరో సుగుణం. ఆయన వయస్సులో ఉన్న ఆడపిల్లల కష్టాలు చూసి వోర్చుకోలేడు.

ఇంత గొప్పవాడికున్న జీవిత ధ్యేయాలు రెండే రెండు: అందులో మొట్టమొదటిది గోపన్నకి మణిని కట్టబెట్టి వృద్ధాప్యంలో వాళ్ళ దగ్గరుంటూ మనవల్ని తనంతటి వాళ్ళనుగా చెయ్యటం. రొండోది, తన మేనల్లుడ్ని, కూతుర్ని ఫారిన్ పంపించటం. ఈ మధ్య వాళ్ళెదురింటి సుబ్బయ్య మాటల్లో సందర్భం లేకుండా మాటిమాటికి 'మా అల్లుడీ మధ్య ఫారినెళ్ళినప్పుడు, అంటూ అల్లుడ్ని జబ్బట్టుకుని లాక్కొస్తుంటే సిద్ధయ్యకి తలకాయ నొప్పిగా ఉంటోంది. కాని బయటికి మాత్రం. 'అప్పుడేమైంది' అని అడుగుతాడు. మరి రేపు తన కూతురు, అల్లుడు వెళ్తే తనకి మాత్రం శ్రోత కావద్దూ! అప్పుడు సుబ్బయ్యెక్కడికి పోతాడు? పైగా అందరితో సుబ్బయ్యల్లుడు ఫారినెళ్ళొచ్చాడు అని సిద్ధయ్య గొప్పగా చెప్తున్నట్టు నటిస్తాడు. ఇది గోపన్న వెళ్ళొచ్చేటప్పటి కోసం నేల చదును చెయ్యటం అన్నమాట.

అయితే సిద్ధయ్య తాలూకు రొండో కోర్కె మీద గోపన్నకి కథా కాలం నాటికి సదభిప్రాయం లేదు. గోపాల్రావ్ చదువంతా పదహారణాల తెలుగువాడి పద్ధతిలో జరిగింది. ఎస్సెల్సీ పాస్ అవగానే అందరూ ఏం చదువుతావని అడిగినప్పుడు అరవ కుర్రాడిలాగా అయ్యేయస్, ఇంజనీరింగ్, మెడిసిన్ అని చెప్పకుండా 'ఇంటరు' అన్నాడు! 'ఆ పైన అంటే' 'ఏమో అప్పుడెల్లాగుంటాయో పరిస్థితులు' అన్నాడు. అదయ్యాక తన తక్షణ కర్తవ్యం బియ్యస్సి అని నిర్ణయించుకున్నాడు. అది చదివాక ఏం చెయ్యాలో అందులో చేరినప్పుడు తనకి తెలియదు. అదయ్యేటప్పటికి ఉత్త బియ్యస్సి ఈనా డెందుకూ పనికిరాదని అందరూ అంటే

ఎమ్మెస్సీ చదివాడు. అదయ్యాక అయ్యేయస్ అరవ్వాళ్ళకి రిజర్వుడని తను పి.హెచ్.డి. చేయాలనుకున్నాడు. అదయ్యాక ఏం ఉద్యోగం వస్తుందో, అసలు వస్తుందో రాదో కూడా గోపన్నకి తెలియదు. కాని గోపాల్రావ్ పిహెచ్.డి. చెయ్యటానికి నిర్ణయించుకున్నాడు.

సిద్దయ్యోరోజు 'పెందరాళే పెళ్ళి చేసుకుని ఫారినెళ్ళొచ్చేయి గోపన్నా' అన్నాడు.

'నేను వెళ్ళను. పి.హెచ్.డి. అయితే గాని పెళ్ళాడను' అన్నాడు గోపన్న.

ఈ దెబ్బకి సిద్దయ్య సిద్ధంగా లేడు. అందుచేత ఆయనుద్రేకం లౌక్యాన్ని జయించింది- 'అల్లాగైతే మా మణిన్నీకిచ్చి చేసేది లేదు. నా అల్లుడు అమెరికా వెళ్లొచ్చినవాడై యుండాలి. కనీసం పెళ్ళయ్యాకైనా వెళ్ళాలి. అల్లాంటి వాడికే ఇస్తాను.' అన్నాడు.

గోపన్నకి మణంటే చాలా ఇష్టం. అయితే మాత్రం ఈ కాబోయే మావ తన వీక్‌నెస్‌ని ఎక్స్‌ప్లాయిట్ చేస్తుంటే గోపన్న ఊరుకోలేక పోయాడు. అతడు బోల్డు తెలుగు సినిమాలు చూశాడు. సరిగా ఇదే పరిస్థితుల్లో నాగేశ్వర్రావేం చేస్తాడో గుర్తు చేసుకున్నాడు. ఆ పైన 'నీ ఇష్ట ప్రకారమే కానీ మావయ్యా' అన్నాడు. సిద్దయ్య మొహంలో వెయ్యి దీపాలు వెలిగి పోయాయి.

'మణికి మంచి సంబంధం వెతుకుదాము. నీ ఆశలకి, ఆశయాలకి నేను అడ్డురాను' అని తాపీగా పూర్తిచేశాడు గోపన్న. వెయ్యి డోళ్ళు మోగాయి. సిద్దయ్య మొహంలో వెయ్యి దీపాలు ఆర్పేసుకున్నాడు. ఆయన తన పొరపాటు గుర్తించాడు.

'ఏదో మాట వరస కన్నాను. నే నెవడిని మధ్య, మణికి వరుడ్ని నిర్ణయం చెయ్యటానికి? అది నిన్ను తప్ప చేసుకోదు. పైగా మీ అమ్మ చచ్చిపోయేటప్పుడు నేను చేసిన ప్రమాణం... దాని మాటేమిటి.. అది సరేగాని అడ్డమైనవాడూ ఫారినెళ్తామని పేచీలు పెడతారే, నువ్వెళ్ళనంటా వేం విడ్డూరం!' అని రాజీకి వచ్చాడు సిద్దయ్య.

'అందరు పెద్దవాళ్ళు ఫారినెళ్తే పిల్లలు చెడిపోతారని వెళ్ళొద్దంటే, నువ్వు, అందులో పిల్లనిచ్చుకునే ఉద్దేశం ఉన్నవాడివి, నన్ను ఫారిన్ తరిమేస్తున్నా వేమిటి మావయ్యా!' అని సాగదీశాడు గోపన్న.

'హోర్నీ! నువ్వు పరవాలేదురా! నీకూ తెలివితేటలున్నాయి! మరి ఇండియాను పట్టుకుని వేళ్ళాడ్తా వేమిరా? ఇండియాలో ఏముంది?'

'ఇండియాలో ఏం లేదు. నిజమే. అందుకనే ఇక్కడ ఏ కొంచెం చేసినా దేశానికి లాభం. పైగా ఇండియాలో ఏం లేకుండా రీసెర్చి చెయ్యగలగడం గొప్ప. ఫారిన్లో ఏం చేసినా మెషీన్లది, కంప్యూటర్లది గొప్పతనం కాని మనది కాదు. అందుకనే చాలా మంది ఫారిన్ వెళ్లొచ్చిన వాళ్ళు ఇండియాకి వచ్చాక ఏం చెయ్యలేక పోతున్నారు. అల్లాంటి వాళ్ళవల్ల దేశాని కేం లాభం? కాని ఇండియాలో పి.హెచ్.డి చేసిన వాళ్ళు ఫారిన్ వెళ్తే, ఇక్కడికి మూడింతలు అక్కడ చేసి దేశానికి, వాళ్ళకి పేరు తెచ్చుకుంటున్నారు. తిరిగివచ్చి దేశాన్ని బాగుచేస్తున్నారు' అన్నాడు గోపన్న - ఉద్రేకంగా, భక్తిగా.

'నాకు చాలా సంతోషంగా ఉంది గోపన్నా! నా మేనల్లుడికి నాలాగా దేశభక్తి వంట

పట్టడం నాకు చాలా గర్వంగా ఉంది. కాని ఏ యూనివర్సిటీలో చేద్దామనుకుంటున్నావు రిసెర్చి"?

'ఇంకా నిర్ణయించుకోలేదు. అన్ని చోట్లకి వోసారి వెళ్ళి చూసొచ్చి నిర్ణయించుకుందా మనుకుంటున్నాను.'

'నేనూ వస్తాను పద' అన్నాడు సిద్దయ్య.

'సరే' నన్నాడు గోపన్న.

'నువ్వెక్కడైనా ఏదైనా వింత చూస్తే నా చెవిని కూడా పడెయ్యాలి, తెల్సిందా?' అని శాసించాడు సిద్దయ్య.

'సరే' నన్నాడు గోపన్న.

# మొదటి మజిలీ

రాత్రి రైలు దిగి సిద్దయ్య, గోపన్న యూనివర్సిటీకి దగ్గరలో ఉన్న లాడ్జిలో పడుకున్నారు. మర్నాడు పొద్దున్న గోపన్న లేచేసరికి బారెడు పొద్దెక్కింది. సిద్దయ్య మాఁవప్పుడే ఇడ్లీలు తిని న్యూసు పేపరు చదువుతున్నాడు. గోపన్న కాఫీ తాగి సిగరెట్టు కోసం వీధి లోకి రాగానే అక్కడో ముష్టి యువకుడు తగిలి ధర్మం అడిగాడు. గోపన్న తెలుగు బిడ్డ. తెలుగు వాళ్ళు దానధర్మాలకి ప్రసిద్ధి. అందుకని సిగరెట్టు కొనగా కొట్టువాడిచ్చిన చిల్లర ఆ యువకుడి చేతిలో పెట్టాడు. ఆ యువకుడు తలడ్డంగా తిప్పి- 'దిస్ వోంటు డూ మాస్టారు! మినిమమ్ వన్ రూపి. అంతకు తక్కువైతే ముట్టేది లేదు. అన్నాడు.

'ఏమిటీ ఘరానా ముష్టి' అని విసుక్కునాడు గోపన్న.

ఘరానా ముష్టే బాబు. యూనివర్సిటీలో పిహెచ్.డి. చేస్తున్న నాకు చిల్లర పుచ్చుకోడానికి మనసొప్పదు సార్. అల్లా చేస్తే నా కూ, మామూలు ముష్టివాడికి తేడా ఉండదు.'

'మీరు రీసెర్చి స్కాలరా!' ఆశ్చర్యపోయాడు గోపాల్రావ్.

'అవున్నాయినా!'

'స్వామీ మీరు యు.జి.సి. మరియు సి.యస్.ఐ.ఆర్.ల పేర్లు వినలేదా? వారు పి.హెచ్.డి చేసుకునేవాళ్ళకి స్కాలర్ షిప్స్ ఇస్తారని వినియుంటిని. మీకా స్కాలర్షిప్పు రాలేదా? వస్తే ఈ యాచనేమిటి?' అంటూ బోల్డు ప్రశ్నలు కుప్పించాడు గోపాల్రావ్.

'ఇస్తారు నాయనా!.... కానీ....' అంటూ ఆ యువకు డాగి పోయాడు. అందులో కేవలం సామాన్య మానవుడివి నీకీ విషయాలెలా తెలిసాయి అన్న సందేహం కనిపించింది గోపాల్రావ్కి.

'నే నిక్కడున్న యూనివర్శిటీలో నాకు పి.హెచ్.డి. చెయ్యడానికి అవకాశం ఉంటుందేమోనని కనుక్కోడానికి వచ్చాను మాష్టారూ!' అన్నాడు గోపాల్రావ్.

'అయితే నువ్వా బుర్ర మీసాలాయన మేనల్లుడి వన్నమాట. సరే, నీకు నాకథ చెప్తాను. సావధానంగా విను' అంటూ మొదలు పెట్టాడు.

# 1. నెలనెలా రాని స్కాలర్ షిప్పుల కథ

'రెండు సంవత్సరాల క్రితం యూనివర్సిటీ గ్రాంట్సు కమీషన్‌వారు, పిహెచ్.డి. చేసే నిమిత్తం నాకు స్కాలర్ షిప్పు ఇచ్చారు. అది చూసి నేను చాలా గొప్పవాణ్ణని అందుకనే యు.జి.సి. నాకు స్కాలర్‌షిప్పిచ్చిందని మా ఇంట్లో అనుకుని ఆ మాటే అందరితోను చెప్పారు. ఈ మాట విన్న ఆడపిల్లల తండ్రులు నా గొప్పతనాన్ని నిమిషాల మీద ఒప్పుకుని నాలాంటి వాడికి కనీసం ఒకటే ఒక్క భార్యైనా ఉండకపోతే ఘరానాగా ఉండదని అన్నారు. పెళ్ళి చేస్తామని పెద్ద వాళ్ళు ముందర కొస్తే వద్దనే మగాడుండడు కదా! సరే అన్నాను. దాని ఫలితంగా సంసార సాగరాన్ని విజ్ఞాన సాగరాన్ని, ఒకే ముహూర్తంలో ఈదటం మొదలు పెట్టాను. అందుకని సముద్రా లీదటంలో మిహిర్‌సెన్ బాబు కంటే గొప్పవాణ్ణని నా ఉద్దేశం.

'రెండేళ్ళు గిర్రున తిరిగాయి. అప్పటికి నాకో అమ్మాయి. మళ్ళీ ప్రెగ్నంటుగా ఉన్న భార్య కాకుండా, ఊరు మీద చేతి బదుళ్ళున్నాయి. సరిగా అంత శుభ సమయంలో నాకు స్కాలర్ షిప్ ఆపేశారు, రెండేళ్ళయినందువల్ల. రెన్యువల్‌కి మా గైడు వ్రాసి మూణ్ణెల్లయింది. రోజులు కడవటం భారంగా ఉంది. అందుకని పొద్దున్న సాయంత్రం ఈ పార్టు టైమ్ జాబ్ చేస్తున్నాను. అదే లెండి ముష్టి'

'స్కాలర్ షిప్పు రెన్యూ చేసినప్పుడు రెట్రాస్పెక్టివ్‌గా ఇస్తారని విన్నానే!' అన్న సందేహం వెలిబుచ్చాడు గోపాల్రావు.

'కాదని ఎవరన్నారు? కాని అందాక బతకాలి కదా! అందులోను లేనివి ఆస్తి పాస్తులు, ఉన్నవి పెళ్ళాం బిడ్డలు అయితే ఎంత కష్టం! పైగా నేను ఉద్యోగంలో చేరి విడిపిస్తే గాని మా ఇంటిని మళ్ళీ మా చెల్లెలు పెళ్ళికి తాకట్టు పెట్టటానికి వీలవదు. నా లాంటి వాళ్ళ మాట నేను చెప్తున్నది. పైగా స్కాలర్ షిప్ రెన్యూ చేస్తే ఆరు నెలల కిస్తారు. ఏడాది కిస్తారు కాని ఇచ్చేటప్పటికి నాల్గు నెలలై పోతాయి. వచ్చిన ఎరియర్సు అప్పులు తీర్చడానికి చాలవు. అందుకని మళ్ళీ ఈ పార్టు టైమ్ జాబులో జేరక తప్పదు.. ఇండియాలో పిహెచ్.డి. సగటు మీద నాల్గయిదు సంవత్సరాలు పడుతుంది. అల్లాంటప్పుడు రిసెర్చి స్కాలర్స్‌కి చివర్లో ఈ పార్టుటైమ్ జాబేగతి. నేనైనా మీరైనా అంతే' అన్నాడు ము.యు.

'పోనీ సియస్సయ్యార్ ట్రై చెయ్యలేక పోయారా?' సలహా ఇచ్చాడు గోపాల్రావ్.

ఉరుములు ఉరిమినట్టు, మరేమో ఇంకా, పిడుగులు పడ్డట్టు శబ్దమైంది. అది ము.యు. నవ్వు. అది చూసి ముడుసుకొని గోపాల్రావ్ 'మీరు రాజనాల సిన్మాలు చూస్తారు కాబోలు. అవంటె నాకు భయం' అన్నాడు కళ్ళు మూసుకుంటూ.

'అదేంలేదు. ఈ రెండో కిళ్ళీ బడ్డీ వేపు చూడు నాయనా! ఏం కనిపిస్తుంది?'

'తనబోటి పెద్దమనిషే! త్రాగిమిందక చేసిన పనే చేస్తున్నాడు.'

'సరిగ్గా పోల్చుకున్నావు. అతగాడు సియస్సయార్ స్కాలర్. మూణ్ణెల్లుగా స్కాలర్ షిప్పు లేదు. ప్రయివేటు స్కూల్లో బడిపంతుల్లాగా, ఇవాళిస్తారు రేపిస్తారని జీతం కోసం ఎదురు

చూస్తున్నాడు. చూసేవుగా మా బాధలు. అందుకని బ్రదర్! అమెరికా వెళ్ళి బుద్ధిగా బాగుపడు' అన్నాడు యస్టీ స్టైయిల్లో కన్నీళ్ళు చూపుడు వేలుతో తుడుచుకుంటూ.

గోపాల్రావ్ 'మా మామని కల్సారా?' అని అడిగాడు అనుమానంగా.

'సందేహించటం రీసెర్చి చెయ్యాల్సిన వాళ్ళ కుండాల్సిన లక్షణం. అది నీ దగ్గర పుష్కలంగా ఉంది. పైగా నీ దగ్గఱ ఒరిజినల్ థింకింగు కూడా ఉంది. ఈ లక్షణాలమెరికాలో రాణిస్తాయి. నా టిన్ ఇండియా. మీ భావాన్ని తక్కువ మాటల్లో సూటిగా ఎక్స్ప్రెస్ చెయ్యటం మీకు వచ్చు. మా మావని కల్సారా అన్న డైలాగ్ చాలా పవర్‌ఫుల్‌గా ఉంది. మీ రనవసరంగా మీ టాలెంటు నిండియాలో వేస్టు చెయ్యకండి,' అని సలహా యిచ్చాడు ము.యు.

'మా మావకి బోల్డు డబ్బుంది. పైగా ఒక్కతే కూతురు. ఆ అమ్మాయికి నేనంటే ప్రేముంది. అందుకని నాకు స్కాలర్ షిప్ నెల నెలా రాకపోయినా ఇబ్బంది లేదు.... వస్తా!' అంటూ యూనివర్సిటీ దిక్కుగా నడిచాడు. బుంగమీసాలాయన న్యూస్ పేపరు చాటు నుంచి గోపన్న యూనివర్సిటీ దిక్కుగా పోవడం గమనించాడు.

గోపాల్రావ్ దారిలో అన్ని వింతలు చూసుకుంటు యూనివర్సిటీకేసి నడిచాడు. మధ్యదార్లో 'ఓ , డ్డాలబ్బి దారి కడ్డు తగిలి 'యూనివర్సిటీ దిక్కుగా పోకు చెడిపోతావు!' అంటూ సలహా ఇచ్చాడు.

'ఎందుకు?' అని అడిగాడు.

'పిచ్చాడిని ఎవరు ప్రశ్న లడగరు' అన్నాడు ఆ పక్కనే చెట్టు కింద నిలబడి అంతా గమనిస్తున్న పెద్దమనిషి. ఆ పైన గోపాల్రావు సంగతి ఆరా తీసి తను అటే వెళ్తున్నాడని చెప్పి నడవమన్నాడు. ఇంతలో మేఘ గర్జనలాగా పిచ్చబ్బాయి 'చెడిపోతావు' అని కేక పెట్టాడు. పక్కనున్న పెద్దమనిషి గోపాల్రావు చెవులు మూశారు. 'ఏంలేదు, కొత్తవాళ్ళ చెవులీ అరుపులకి చిల్లులు పడతాయి' అని సంజాయిషీ ఇచ్చాడు.

దార్లో ఆ పెద్దమనిషి తను గోపాల్రావ్ పిహెచ్.డి చెయ్యదల్చుకున్న సబ్జెక్టులో ప్రొఫెసర్ననీ, తన దగ్గర రిజిస్టర్ చేసుకుంటే పిహెచ్.డి త్వరగా వస్తుందని చెప్పాడు. తనెంత మంచివాడో, తన దగ్గర రిసెర్చి చేసేవాళ్ళకి తనెన్ని సదుపాయాలు చేస్తాడో, తన కిందెంత మంది విద్యార్థులున్నారో చెప్పాడు. ఆపైన గోపాల్రావ్ తన దగ్గరే పిహెచ్.డి చెయ్యాలని పట్టు బట్టి అతని చేత ఒట్టు వేయించుకున్నాడు.

ఆ విషయం భోజనాల దగ్గర సిద్ధయ్య మావతో గోపన్న చెప్పాడు. సిద్ధయ్య జుట్టు పీక్కున్నాడు. అప్పుడు గోపన్న మధ్యలో 'మావయ్యా! ఇవాళో గమత్తు జరిగింది. దార్లో మా కాబోయే ప్రొఫెసరు కనిపించిన చోట వో పిచ్చబ్బాయి కనిపించి, యూనివర్సిటీ కేసి నే వెళ్తే చెడిపోతానని హెచ్చరించాడు. ఎందుకల్లా అంటున్నాడని నే నడిగితే మా కాబోయే ప్రొఫెసర్ తెలియదన్నాడు. ఏమిటో ఆ విషయం తలుచుకుంటే ఆశ్చర్యంగా ఉంది' అన్నాడు.

సిద్ధయ్య ఒక్క ఉదుటున లేచి పిచ్చబ్బాయి అనబడే అబ్బాయి దగ్గరకు వెళ్ళాడు. అతనికి సిగరెట్లు కాఫీ ఇచ్చి ప్రసన్నుడిగా చేసుకుని అతని కథ తెల్సుకుని వచ్చాడు.

## 2. పరిశోధనా చౌర్యం కథ

'అనగా అనగా ఈ ఊళ్లో ఒక యూనివర్సిటీ కలదు. అందులో నవనీత చోరుడు అను ప్రొఫెసర్ కలడు.' అంటూ సిద్దయ్య కథ చెప్తూంటే-

'కథ కాశీ మజిలీల స్టయిల్లో చెప్పకు. పిట్ట కథలు తీసేసి టూకీగా చెప్పు. ఇది సైంటిఫిక్ మెటీరియల్. చాల క్లుప్తంగా చెత్తా చెదారం తీసేసి చెప్పాలి' అన్నాడు గోపన్న.

'ఏడ్చావులేవోయి! ఎంటీ, సైంటిఫిక్ మెటీరియలా! నీ నెత్తి కాదూ!.... కోపం వద్దు... అల్లాగే చెప్తాలే, ప్రొఫెసర్ నవనీత చోరుడికి వెన్నంటే ఇష్టం లేదు. అందుకని పేరులో నవనీతాన్ని అసింటా నెట్టి ఉత్త చోర్ అని ఉంచుకున్నాడు, ప్రొఫెసర్ చోర్ సార్థక నామధేయుడు. ప్రపంచంలో గ్రంథ చౌర్యం, భావ చౌర్యం, ధన చౌర్యం ఎంత కాలం నుంచి ఉన్నాయో పరిశోధనా చౌర్యం అంత అనాదిగా ఉంది. అయితే సామాన్యులకి అవి తెలిసినంతగా దీని గురించి తెలియదు. చరిత్ర పుటలు తిరగేస్తే ఒకడు శ్రమపడి కనుక్కున్నది మరొకడి పేరు మీద చెలామణి అవటం కనిపిస్తుంది. అయితే ఇది అన్ని దొంగతనాలలోకి క్లిష్ట తమమైనది. దీన్ని ప్రొఫెసర్ చోర్ కూలంకషంగా అభ్యసించాడు. ఎన్నో పరిశోధనలు ఆయన పేరు మీద చెలామణి అవటంవల్ల ఆయనకి చాలా పెద్ద ప్రొఫెసరన్న పేరు వచ్చింది.

అయితే ప్రొఫెసర్ చోర్ విషయం అధికారులకి తెలియదా అంటావేమో? వాళ్ళు ఈయన్ని మించిన ఘనులు. అక్కడ పూర్వం ప్రిన్సిపాల్‌గా ఉన్నాయన ఒక ప్రొఫెసర్ వ్రాసిన పుస్తకం మీద ఆయన చేత తన పేరు బలవంతంగా పెట్టించుకుని, అచ్చేశాక లాభాల్లో వాటా పంచుకుని, ఆపైన ఆ పుస్తకం తనే వ్రాశాడని, ఆ ప్రొఫెసర్ ప్రూఫ్ కరెక్షన్లో మాత్రమే సాయం చేశాడని తను మంచి వాడవడం చేత ఆయన పేరు కూడా పుస్తకం వ్రాసిన వార్ల పేర్లలో జేర్చాడని ప్రచారం చేసి పేరు తెచ్చుకుని గవర్నమెంటాఫ్ ఇండియాకి ఆ విభాగంలో సలహాదారుడిగా పెద్దుద్యోగం సంపాదించాడు. అంటే ఆ యూనివర్శిటీలో దొంగతనాలు పబ్లిగ్గానే జరుగుతున్నా ఎవరు వాటిని గుర్తించరు. అల్లా అక్కడ దొంగతనాలు కండువా వేసుకుని తిరుగుతూ ఉన్నాయి. కనుక ప్రొఫెసర్ చోర్ తను చేస్తున్నది తప్పు పనని ఎన్నడు అనుకోలేదు.

ఆయన పేరు ప్రఖ్యాతులు దేశమంతటా వ్యాపించాయి. ఆయన మొహం తేజస్సుతో వెల్గిపోతూ కాంతి కిరణాలు వెదజల్లటం మొదలు పెట్టింది. అందులో వో కాంతి కిరణం అంబాజీపేట మీదుగా వెళ్తుంటే అది వి. వెంగన్నారావు కంటపడింది. 'చేస్తే పిహెచ్.డి ఇలాంటి వాడి దగ్గరే చెయ్యాలి' అనుకుని తండ్రి నడిగి డబ్బు, నాయినమ్మ నడిగి మినపసున్ని తీసుకుని ఈ ఊరు చేరాడు.

ప్రొఫెసర్ చోర్‌ని చూసి వి.వి.రావు చాలా ఉబ్బిపోయాడు. 'మీరు చాలా గొప్పవారు. మీ పేరు విన్నాను. మీ దగ్గర పిహెచ్.డి. చెయ్యనిస్తే నా జన్మ ధన్యమైనట్టు భావిస్తాను' అన్నాడు.

'గొప్పవాళ్ళు, తెలివైనవాళ్ళు మాత్రమే అవతలవాళ్ళ గొప్పతనాన్ని పోల్చుకుంటారు'

అని వి.వి.రావ్‌ని పొగిడాడు ప్రొఫెసర్ చోర్. ఇల్లా పరస్పరం పొగుడుకోటం అయ్యాక వి.వి.రావ్ ప్రొ.చోర్ దగ్గర కొలువుకు కుదిరాడు.

వి.వి.రావుని ప్రొ.చోర్ చాలా ప్రోత్సహించాడు. వి.వి.రావ్ స్వతహాగ తెలివితేటలున్న వాడవటం చేత రెండేళ్ళయ్యేసరికి రిసెర్చి వో దారి పట్టింది. అతను తను శ్రమపడి సాధించినదాన్ని వ్యాసరూపంలో వ్రాశాడు. (చదువరీ, ఈ వ్యాసాన్ని ఇకనుంచి రిసెర్చి పేపరని వ్యవహరింతుము).

ఈ రిసెర్చి పేపర్ల క్వాలిటీని బట్టి వ్యక్తులకి పేరు ప్రఖ్యాతులు వస్తాయి. నిజమైన ఒరిజినల్ పేపర్లు మూడు నాలుగు ఒకే విషయంలో ఉంటే అవన్నీ కలిపి ఒక (సిద్ధాంత వ్యాసం) థీసిస్ తయారు చెయ్యొచ్చు. దాని స్థాయినిబట్టి ఆ వ్యక్తికి పిహెచ్.డి. ఇవ్వడం - ఇవ్వకపోడం ఉంటుంది. ఈ రిసెర్చి పేపర్లు కూడా పెద్ద రచయితల కథల్లా పెద్ద వాళ్ళంటే, పేరు ప్రఖ్యాతులున్న ప్రొఫెసర్ల పేర్లతో, పోతే సాధారణంగా అచ్చయి ఊరుకుంటాయి. అందుకని విద్యార్థులు అప్పటికే పేరొచ్చిన వాళ్ళ గైడు పేరు గూడా తగిలిస్తారు. మొదటి పేరు తాలూకు స్వంతదారుణ్ని సీనియర్ ఆథర్ అని, రెండవ పేరు తాలూకు చిన్న మనిషిని జూనియర్ ఆథర్ అని అంటారు. ఈ సీనియర్ ఆథర్ నిజంగా పరిశోధన చేస్తుంటే జూనియర్ హెల్పు చేశాడని, అందుకని అతడి పేరు కూడా ఆ పేపర్లో పెట్టబడిందని అందరు అర్థం చేసుకుంటారు. కాని ప్రస్తుతం ప్రపంచంలో ముఖ్యంగా ఇండియాలో విద్యార్థి కే విధంగా హెల్పు చెయ్యక పోయినా గైడు పేరు కూడా పేపరు మీద పెట్టడం జరుగుతోంది. ఏమంటే ఒక విద్యాలయంలో ఉంటూ అక్కడి అధికారుల అనుమతి లేకుండా పరిశోధనా ఫలితాన్ని సైంటిఫిక్ జర్నల్సులో పబ్లిష్ చెయ్యడానికి రూల్సొప్పుకోవు. ఇల్లా రూలుండబట్టి విద్యార్థి అనుమతి అడుగుతాడు. కాని కొన్నాళ్ళకి పెద్దవాళ్ళ పేర్లు కూడా పేపరు వ్రాసిన వారి లిష్టులో జేరుస్తే అనుమతి త్వరగా ఏ అడ్డంకులు లేకుండా వస్తుందని గుర్తిస్తాడు. (ఆ పైన ఎవరి పేరు ముందుండాలన్నదో పెద్ద భాగవతం). పెట్టకపోతే చాలాసార్లు అసలు అనుమ తేరాదని తెల్సు కుంటారు.

అందుకని వి.వి.రావ్, ప్రొ.ఛోర్ విలువైన అభిప్రాయాన్ని కోరి ఆ పేపర్ని ఆయన చేతి కిచ్చాడు. వో నెల్రోజుల తరువాత వి.వి.రావ్ ధైర్యం పుంజుకుని, 'ఎలా ఉందండి'? అన్నాడు.

'ఏమిటి?' అని తిరిగి అడిగాడు ప్రొ.ఛోర్.

'ఆ.. అదేనండి... నేను వ్రాసిన పేపరు' అంటూ నీళ్ళు నమిలాడు.

'వో.. అదా! చూస్తున్నాను. ఇంకా పూర్తవలేదు. అవగానే పిల్చి చెప్తాను. మనకి మంచి రిజల్ట్సే వచ్చినట్టున్నాయి' అన్నాడు. ప్రొ.చోర్ 'ఇందులో నేను గూడా ఉన్నానోయి' వి.వి.రావ్ అని సజెస్టు చేస్తూ, అది అర్థం చేసుకున్నా 'నేను' కూడా 'మన'లో ఉన్నాను కదా అని తృప్తిపడ్డాడు రావ్.

ఇల్లా ఇంకో ఏడాది గడిచేసరికి ఆ పేపరు విషయం తెలియలేదు కాని వి.వి.రావ్ తయారుచేసిన రెండో పేపరు ప్రొ.చోర్‌ని చేరింది. అందులో ముసుగులో గుద్దులా టెండు కని తన పేరు ముందు ఆయన పేరు వెనుక పెట్టాడు. అది చూసి 'వచ్చే నెల ప్రపంచ సమావేశం

జరుగుతోంది. వాళ్ళు నన్నో పేపరు పంపమని అడిగారు అర్జెంటుగా కావాలిట. ప్రస్తుతం నా దగ్గరేం లేవు. ఇది నువ్వేం అనుకోకపోతే అక్కడికి పంపిస్తాను. కాని వాళ్ళు నన్ను రిక్వెస్టు చేశారు. కనుక నా పేరు మొదటి పేరుగా ఉంటే బావుంటుంది' అన్నాడు ప్రొ.చోర్. ఆపైన వి.వి.రావ్ కళ్ళల్లోని భావం చదివి -

'ఇది మాత్రం నా పేరు ముందు పేరుగా పోనీయి. వచ్చేసారి నీదే ముందర పెడదాం. ఏంమ్మా!' అన్నాడు రాజబాబు స్టయిల్లో. అందుకని రెండో పేపరు వి.వి.రావ్ జూనియర్ ఆథర్‌గా సమావేశానికి వెళ్ళింది.

అది జరిగిన మూడు నెలలకి- అంటే వి.వి.రావ్ జేరిన మూడేళ్ళ మూడు నెలలకి అతని మొదటి పేపరు వో ప్రఖ్యాత జర్నల్లో అచ్చయింది. అతడానందంతో ఉబ్బి తబ్బిబ్బయ్యాడు. కాని తరువాత ఆథర్స్ పేర్లలో తన పేరు లేకుండా పోవడం చూసి మూర్ఛపోయాడు. అది సింగిలాథర్ పేపరుగా, ఆ ఆథర్ ప్రో.చోర్‌గా అచ్చయింది. మూర్ఛ నించి తేరుకుని ధనుర్బాణాలు ధరించి ప్రొ.ఛోర్ దగ్గరకు వెళ్ళాడు. అప్పుడు ప్రొ. ఛోర్ గుమ్మడంత శాంతంగా, 'గురుర్విష్ణు... తన కోసమే తన శత్రువు... నమ్మి చెడినవాడు లేడు...' మొదలైన సూక్తులన్నీ చెప్పి 'నాయనా, వెర్రి వెంగన్నా రావ్! నువ్వు అల్లరి చేసినా ఆ వ్యాసం నువ్వు వ్రాసినట్టు రుజువు చెయ్యలేవు. అందుకని నాతో సఖ్యంగా ఉంటే ఇక్కడ నుంచి నువ్వు సీనియర్ ఆథర్‌గా పేపర్లు వ్రాద్దాం సరేనా?' అన్నాడు.

కాని ఈలోగా వెర్రి వెంగన్నారావుకి రిసెర్చి మీద అసహ్యం పుట్టింది. ఉత్సాహం పోయింది. నాలుగేళ్ళయేసరికి అతని ప్రోగ్రెస్ రివ్యూకి వచ్చింది. అతని వ్యవహారం చూస్తే ఏమంత ప్రోత్సాహకరంగా లేదని ప్రొ.చోర్ గుర్తించాడు, అల్లాంటివాడి నుంచుకుంటే తన కొరిగేదేం లేదు. ఈ ఆవు ఇంక పాలివ్వదు. అతని స్థానే మరొకణ్ణి తీసుకుంటే నయం అని నిర్ణయించుకుని, అతని ప్రోగ్గెస్సేం సంతృప్తిగా లేదు కనుక అతనికి స్కాలర్‌షిప్పా పేసి మరోడికివ్వాల్సిందని వ్రాశాట్ట.

స్కాలర్ షిప్పు కూడా పోయేసరికి వి.వి.రావుకి మతి స్థిమితం తగ్గింది. నువ్వు చూసిన పిచ్చివాడు వి.వి.రావు. నీతో యూనివర్సిటీ దాక నడిచిన మనిషి ప్రొ. చోర్ అని గోపన్నకి కథ చెప్పటం ముగించాడు సిద్దయ్య.

'ఆయనపేరు ప్రో.ఛోర్ కాదే...' అని ఆలోచిస్తున్న గోపన్నతో, 'అసలు పేరు చెప్తే ఏం బావుంటుద్దీ? వో పెద్ద మనిషి ననవసరంగా రచ్చన పడేయటం తప్పించి' అన్నాడు.

## రెండో మజిలీ

తూర్పు దిక్కు అచ్చిరాలేదని రైలెక్కి నేరుగా దక్షిణ దిక్కుగా ప్రయాణం చేశారు మావా అల్లుళ్ళు. దారిలో కనిపించినవాళ్ళని 'అటుకేసి మంచి యూనివర్సిటీ ఉందా?' అని అడుగుతూ పోవటం మొదలుపెట్టారు. తెలియనివాళ్ళు తెలియదని ఒప్పుకోడం ఇష్టం లేక,

'ఆఁ ఆఁ ఉంది - ప్రతివూళ్ళోను ఉంది' అన్నారు. తెలిసిన వాళ్ళు మాత్రం ఇంకొంచం కిందకు పోతే అక్కడో భారతీయ సంస్థ ఉందని, అక్కడ పెద్ద పెద్ద శాస్త్రజ్ఞులున్నారని, సగం మందికి, వాళ్ళలో గోల్డు మెడల్సున్నాయని, మిగిలిన సగానికి ఎప్పుడో వస్తాయని చెప్పారు. పైగా ఆ స్థలం అమెరికా వెళ్ళేవాళ్ళతో, వెళ్ళి తిరిగి వచ్చిన వాళ్ళతో తీర్థంలా ఉంటుందనీ, అల్లాంటి విజ్ఞాన సముద్రంలో మునిగితేనే ముక్తి అని సలహా యిచ్చారు.

ఆ సలహా ప్రకారం సిద్దయ్య గోపన్నలు ప్రయాణం చేసి ఆ భారతీయ సంస్థ ఉన్న ఊళ్ళో బోర్డింగు అండ్ లాడ్జింగ్ హోటల్లో దిగారు. రాత్రి పూటెవరో తలుపు కొట్టారు. సిటీస్‌లో లాడ్జింగ్ హోటళ్ళలో వాడుకగా వుండే అమ్మాయిలు వచ్చి తలుపు కొడ్తారని సిద్దయ్య విన్నాడు. ఆయనకి పల్లెటూళ్ళో దొరికే నాటు సారా, సానులు మాత్రమే తెలుసు. సిటీస్‌లో దొరికే స్మగుల్డ్ మందు ఎలా ఉంటుందో, కాలేజీ అమ్మాయిలుగా చెలామణి అయ్యే ఆడవాళ్ళు ఎలా వుంటారో తెలియదు. అందుకని చూడాలని వుంది. సిద్దయ్య అటూ ఇటూ చూశాడు. గోపన్న నిద్ర పోతున్నాడని నిర్ధారణకి వచ్చాక మెల్లగా పిల్లిగా వెళ్ళి తలుపు తీశాడు. తలుపు కవతలో యువకుడు నిలబడి ఉన్నాడు. సిద్దయ్య ధైర్యం చేసి 'సరుకుందా?' అని అడిగాడు ఆ యువకుణ్ణి.

'ఆ ఉంది. ఇంటర్నేషనల్ సరుకు, పరిశోధనా దురంధర అసిస్టెంటు ప్రొఫెసర్ బృహస్పతి పిహెచ్.డి ఫ్రమ్ టెక్సాస్. ఆయన కింద చేరిన వాళ్ళకి మూడేళ్ళలో పిహెచ్.డి గ్యారంటీ. మీకు రైల్లో కలిసిన పెద్దమనిషి నాకు టెలిగ్రామ్ ఇచ్చాడు. మిమ్మల్ని కలుసుకోమని, మీరైే ఉండరు. మీతో ఇంకో కుర్రాడుండి ఉండాలి. అతడు మా సంస్థలో పిహెచ్.డి. చేస్తారుట. ఫర్‌గెట్ నాట్ డాక్టర్ బృహస్పతి, మీతో ఉన్న కుర్రాడు పిహెచ్.డి.కి తన పేరు నమోదు చేయించుకునేప్పుడు డాక్టర్ బృహస్పతినే గైడుగా వాడండి' అని ఊదరగొట్టి ఆయన చేతిలో ఓ పాంప్లెట్ పెట్టి ఆ యువకుడు మాయమయ్యాడు. 'అరి నీ ఇల్లు బంగారంకాను అనుకున్నాడు' సిద్దయ్య.

మరో గంట పోయాక మళ్ళీ తలుపు చప్పుడైంది. ఈసారి సిద్దయ్య లేవలేదు. కావాలని లేవలేదు. అందుకని విసుక్కుంటూ గోపన్నే లేచి తలుపు తీశాడు. తలుపు కవతల నవయౌవని నిలబడివుంది. ఆమె మొహానికి రాసుకున్న మెరుపు పౌడరు లైట్లు కాంతిలో ధగధగా మెరుస్తోంది. దేహం, చీర ఒకదానికొకటి నప్పి కలిసిపోయి ఉన్నాయి నల్లగా.

'సిద్దయ్యగారనే ఆయన, వారి మేనల్లుడు శ్రీ గోపాల్రావు ఈ ఊరు వచ్చారట' అంది నాందిగా.

'అవును మేం ఈ ఊరు వచ్చాం. అయితే మాతో మీకేం పని' అని అడిగాడు గోపాల్రావ్ అసహనంగా.

'మీకు మా సహాయం, ఆదరణ ఎప్పుడూ ఉంటాయని చెప్పి, మీకేమైనా కావల్సి వుంటే కనుక్కోమని మా కంపెనీవాళ్ళు నన్ను పంపారు' అంది కళ్ళు మిల మిల లాడిస్తూ.

'ఆలాగే - మీ ఎడ్రిసిచ్చి వెళ్ళండి, రేప్పొద్దున్న చూస్తాం' అన్నాడు గోపన్న, ఆతగాడికి ప్రపంచంలో నిద్రను మించిన సుఖాలున్నాయని, అవి నిద్ర లేనప్పుడే అనుభవంలోకి వస్తాయని తెలియదు.

నిద్ర నటిస్తున్న సిద్దయ్యకి 'కంపెని' అన్న మాట కితకితలు పెట్టింది. ఆ అమ్మాయిని అర్థాంతరంగా పొమ్మంటున్న గోపన్న మీద కోపం వచ్చింది. ఆ మాత్రం అర్థం చేసుకోలేకపోతే మగాడుగా ప్రపంచంలో ఏం పనికొస్తాడు! కాని ఆ జడ్డితనం ఉండబట్టే గోపన్నను ఆయన తన కూతురికి మొగుడుగా నిర్ణయించుకున్నాడు. అల్లుడికి కావలసిన అర్హతల్లో ఆ అమాయకత్వ ఒకటి. 'నువ్వుండ్రా గోపన్నా! అర్జెంటు పనులెప్పుడు తొందరగా తేల్చేసు కోవాలి. రేపు మాపనకూడదు. ఇప్పుడేమంత రాత్రయింది గనుక! ఆ ఆడకూతురెంతో ఆశతో వచ్చింది. ఆ అమ్మాయి సంగత్నే జూసుకుంటాలే. నువ్వు నిద్రో' అంటూ సిద్దయ్య లేచాడు.

'అవున్లెండి, పెద్దవారు మీరుండగా ఆ కుర్రాయనతో బిజినెస్ మాట్లాడ్డం నాదే తప్పు' అంది ఆ అమ్మాయి.

'అవునవును' అన్నాడు సిద్దయ్య. 'ఇంతకీ మీ కంపెనీ ఎక్కడ?'

ఆ అమ్మాయి 'ఆ భారతీయ సంస్థకి ఉన్న మెయిన్‌గేటు కెదురుగా వున్న బిల్డింగులో. సంస్థకి దగ్గిరలోనే కంపెనీ ఉంటే బిజినెస్సు సాగుతుందని అక్కడే పెట్టాం' అంది. సిద్దయ్య గుండెల్లో బాంబులు పేలాయి. అల్లాంటిచోట అల్లుడు అవాల్సిన కుర్రాడ్ని చదువుకు వదిలెయ్యటమే. చెడు చెయ్యి వాటు దూరంలో ఉంటే ఇంకేమన్నా ఉందా!

సిద్దయ్య ఆలోచనలోంచి తేరుకునే లోపల, 'మేము అసిస్టెంటు ప్రొఫెసర్ మేధావిగారి తరపున పనిచేసే కంపెనీ వాళ్ళం. ఆయన నిజంగా మేధావి. బియస్సి బెనారస్, ఎమ్మెస్సి ఐర్లండు, పిహెచ్..డి గ్రీన్‌లాండు నుంచి ఆయన సంపాదించారు. ఆయన దగ్గిర సబ్మిట్ చేసిన థీసిస్‌కు గోల్డ్ మెడలు తప్పదు. మెడ వంచి మరీ యిస్తారు. గోపాల్రావ్ అనబడే మీ మేనల్లుడికి ఇంతకంటే మంచి మార్గదర్శి దొరకడు. ఆలసించిన ఆశాభంగం' అంటూ సిద్ధయ్య చేతిలో ఓ పాంప్లెట్ పెడుతూ ఆయన చెయ్యి గిల్లి ఆ పైన (బోరు కొట్టేసిన పాఠకుల నిమిత్తం) పమిట సర్దుకుని వెళ్ళిపోయింది. సిద్దయ్య నిరాశతో మంచం మీద నడుం వాల్చాడు. రాబోయే పంచాయితీ ఎన్నికల్లో ఈ టెక్నిక్ వాడితే ఎల్లా ఉంటుందోనని ఆలోచిస్తుంటే నిద్ర పట్టేసింది.

పొద్దున్న లేచిన గోపన్న చేతిలో తన చేతికి వచ్చిన ఆ రెండు కాగితాలు పెట్టాడు. అవి చదివాక కూడా తన మేధావి దగ్గిర జేరాలో, బృహస్పతి దగ్గిర చేరాలో గోపన్నకి అర్థం కాలేదు. సిద్దయ్య మావ కేసి చూశాడు. 'నా కేసి చూడకు, నాకేం తెలియ'దన్నట్టు చూశాడతని మావ.

అందుకని స్నానం చేసి కాఫీ టిఫిన్ పూర్తి చేసుకొని పండులా డ్రెస్సయి ఆ భారతీయ సంస్థ కేసి నడిచాడు. సంస్థంతా కలియ తిరగుతుంటే ఒకచోట పెద్ద అరుగు మీద ఓ యువకుడు ట్రేసింగ్ షీట్లతో ఏదో కుస్తీ పడుతున్నాడు. వాటి మీద ఏదో వ్రాసుంది.

గోపన్న అతని దగ్గిరకు జేరి 'మీరు చేస్తున్న పనేమిటి?' అని అడిగాడు.

'ఏం, శుక్రాచార్యుడి దగ్గిరకు కచుడిని పంపిన ఆ బృహస్పతిలాగా ఈ బృహస్పతి నిన్ను పంపాడా? నా టెక్నిక్కు నీకు ఛస్తే చెప్పను. నాకు పెళ్ళికెదిగిన కూతుళ్ళు లేరు. అందుచేత లాభం లేదని చెప్పు నీ బృహస్పతితో' అని కసురుకున్నాడు. ఆ పైన 'ఈ వ్యాస

దగ్గిరికి మరోసారి రాయబారం పంపద్దని కూడా చెప్పు' అన్నాడు.

'అయ్యా వ్యాస్‌గారూ! నన్నే బృహస్పతిగారూ పంపలేదు. నేనే - అంటే - నా అంతట నేనే మీరు చేసే పనేమిటో తెల్సుకోవాలన్న కుతూహలంతో వచ్చాను'.

'నేను అల్లా మీ బుట్టలో పడను. నేనే కాదు. అసలు సిసలైన మేధావి శిష్యులెవరూ బృహస్పతి బుట్టలో - అదెంత పెద్దదైనా పడరు. వాళ్ళకా అలవాటు లేదు. గురుద్రోహం చెయ్యం. ఇప్పటికే ఎక్కువ మాట్లాడాను. ఇంకొంచెం మాట్లాడితే రహస్యాలు బయటికి వచ్చేస్తాయి. అందుకని ఇక మాట్లాడను. మీరు మీ దారిన వెళ్ళండి' అంటూ ముగించాడు వ్యాస్.

అక్కడ మేధావి శిష్యుల్ని, బృహస్పతి శిష్యుల్ని కూడా కలుసుకుని, వాళ్ళ అభిప్రాయలు అడిగాడు. కానీ ప్రతివాళ్ళు గోపాల్రావ్‌ని అవతల పార్టీవారి గూఢచారి నెం. 000 అనుకుని నోరు విప్పలేదు.. వీళ్ళంతా డిటెక్టివ్ నవలల్లో కొట్టి చంపినా నోరు విప్పని హంతకుల అనుచరుల్లా ఉన్నారే అనుకుని వెర్రి మొహం వేసుకుని సిద్దయ్య మావ దగ్గిరికి పరిగెత్తి తను సదరు భారతీయ సంస్థలో చూసిన విశేషాలు చెప్పి, 'వ్యాస్చేస్తున్న పనేమిటై ఉంటుదబ్బా!' అన్నాడు. సిద్దయ్య మావ, ' ఆ విషయాలు కుర్రసన్నాసివి, నీకేం తెలుస్తాయి? నే కనుక్కుని సాయంత్రం చేప్తాలే' అన్నాడు.

## 3. అచ్చువేయుము లేక చచ్చుము (పబ్లిష్ ఆర్ పెరిష్) అను కథ

తను ముసలాడినని, రిసెర్చికి రాలేదని, ఉత్తినే అడుగుతున్నాడని తన పంచాయితిలో వ్యాస్‌కు ఉద్యోగం వేయిస్తానని, మున్సబు కూతురు బావుంటుందని, కరణం కూతురు లేచిపోయిందని ఈ కబురు ఆ కబురు చెప్పి బెల్లించి విషయాలు తెలుసుకుని ఆ సాయంత్రం గోపన్న కిల్లా కథ చెప్పడం మొదలు పెట్టాడు.

'అసలు మేధావి, బృహస్పతి కూడా స్వతహాగా మంచివాళ్ళే! లెక్చరర్సుగా ఉన్నప్పుడు ఒకళ్ళతో ఒకళ్ళు పోటీలు పడకుండా ఎవరి పాఠాలు వాళ్ళు చెప్పుకుంటూ హాయిగా వుండేవారు. ఇల్లా ఉంటుండగా ఆ సంస్థ పెద్దలు - పాఠాలెవరైనా ఒకేలాగ చెప్తారని, అల్లాకాక ఒకలాగ చెప్పకపోయినా ఎవరు ఎక్కువ బాగా చెప్పారో నిర్ణయించటం కష్టమని, అందుకని ప్రమోషనులివ్వటానికి వాళ్ళప్పటిదాకా చేసిన రిసెర్చిని కొలబద్దగా వాడాలని నిర్ణయం చేసుకున్నారు. అయినా నాకు తెలవ కడుగుతాకాని, రిసర్చేమైనా గజాల్లో కొలవచ్చా?' అని అడిగాడు సిద్దయ్య.

'అల్లా వీలుకాకపోయినా, రిసెర్చి చేసే ప్రతివాడూ ఓ క్రొత్త విషయం కనుక్కున్నప్పుడల్లా దాన్ని పేపరుగా వ్రాసి అచ్చేస్తాడు. దాన్నిబట్టి నిర్ణయించొచ్చుగా' అని తేల్చిపారేశాడు గోపన్న.

'అల్లాగ కొత్త విషయం కనుక్కున్నప్పుడే రిసెర్చి పేపరు వ్రాయక్కర్లేదని, తీరుబడి దొరికినప్పుడల్లా వ్రాయొచ్చునని నేనీ ఊళ్ళో తెలుసుకున్న విషయం. నా అభిప్రాయం తప్పో రైటో కథ సాంతం విని చెప్పు' అంటూ సిద్దయ్య కథందుకున్నాడు.

'సంస్థ అధికారులిలా నిర్ణయం తీసుకోగానే మేధావి బృహస్పతుల దృష్టి రిసెర్చి వైపు మళ్ళింది. పాఠాలు చెప్పేవాళ్ళకి రిసెర్చి చెయ్యటానికి అంత టైముండదుగనుక ఓ అయిదేళ్ళు అయ్యేసరికి ఒక్కటే ఒక్క పేపరు పబ్లిష్ చేశాడు మేధావి. కాని బృహస్పతి తెలివితేటలు ప్రదర్శించి అయిదు పేపర్లు పబ్లిష్ చేశాడు.

'అదెల్లా అంటే పాఠాలు చెప్పడంవల్ల తనకి ప్రత్యేకంగా ఒరిగేదేమి లేదని గుర్తించిన బృహస్పతి పాఠాలు చెప్పడం మానేసి స్వంత రిసెర్చి చేసుకున్నాడు. అయిదే పేపర్లున్నాయని అధికారులు బృహస్పతిని ప్రమోట్ చేశారు. దాంతో మేధావి కూడా పాఠాలు చెప్పడం మానేశాడు. దాంతో కుర్రాళ్ళు స్ట్రైక్ చేశారు. పార్లమెంటులో ప్రశ్నలు వేశారు. దాంతో అధికారులు కళ్ళు తెరుచుకొని పాఠాలు చెప్పడం ద్వారా ప్రమోషన్ సంపాదించటం కష్టమని మాత్రము ఇదివరలో మేం చెప్పాం కాని, చెప్పకపోతే ఉద్యోగాలు తీసెయ్యడం సులభమేనని దీని ద్వారా పూర్వం తీసుకున్న నిర్ణయానికి క్లారిఫికేషన్ ఇస్తున్నాం' అంటూ క్లారిఫై చేస్తూ మేధావిని కూడా ప్రమోట్ చేశారు. దీంతో బృహస్పతిని జయించా ననుకున్నాడు మేధావి.

'కాని బృహస్పతి తన పేపర్ల సంఖ్యను వృద్ధి చేసుకునేందుకు మరో పథకం వేసుకున్నాడు. అతను తన కింద రిసెర్చికి తీసుకున్న ప్రతి రిసెర్చి విద్యార్థి వల్ల కనీసం ఏడాదికి మూడు పేపర్లు సగటున కిట్టుబాటయితే తనకి ఏడాదికి ముప్ఫై పేపర్లు కావాలంటే పది మంది విద్యార్థులు కావాలని ఆలోచించి అంత మంది విద్యార్థుల్ని తీసుకోడానికి తన దగ్గిర ప్రాబ్లెమ్స్ కుప్పలుగా పడి ఉన్నాయని ప్రచారం చేశాడు. 'అనగానే సరా! విద్యార్థి కో ప్రాబ్లెమ్ చొప్పున పది ప్రాబ్లెమ్స్ ఇవ్వగలగద్దూ' అని ఆలోచించి, మేధావి ముగ్గుర్ని మాత్రమే తీసుకుంటూ నన్నాడు. అప్పుడు బృహస్పతి తెలివి తేటలు ప్రదర్శించి తనెవరికి ప్రాబ్లెమ్ ఇవ్వాల్సిన అవసరం లేకుండా కొంచెం ఇంతో అంతో రిసెర్చి అనుభవం ఉండి అంతకు ముందే స్వంత ప్రాబ్లెమ్సు మీద పని చేస్తున్న పది మంది విద్యార్థులు నాకర్షించి తన కిందకి తీసుకున్నాడు. దాంతో నాలుగేళ్ళయ్యేసరికి బృహస్పతి పేరు ఓ నూరు పై చిలుకు పేపర్ల మీద జాయింట్ ఆథర్‌గా కనిపించింది. అందరూ అతన్ని 'ఆథర్ ఆఫ్ హండ్రెడ్ పేపర్సు'గా రిఫర్ చెయ్యటం మొదలు పెట్టారు. మేధావి తను విడిగా వ్రాసినవి, విద్యార్థులతో కలిసి వ్రాసినవి అన్నీ కలుపుకుని మొత్తం ఓ యాభై పేపర్లు తయారు చేశాడు. మేధావి కంటే బృహస్పతే తొందరగా ప్రొఫెసరవుతాడని చెప్పుకోడం మొదలు పెట్టారు.

'అటువంటి క్లిష్ట పరిస్థితుల్లో వ్యాసనే మెరికలాటి కుర్రోడు మేధావి దగ్గిర యాదృచ్ఛికంగా చేరాడు. ఇతగాడు వేదవ్యాసుడి అపరావతరంగా ప్రకాశించటం మొదలుపెట్టాడు. అయితే వేదవ్యాసుడు వినాయకుణ్ణి లేఖకుడిగా పెట్టుకుని కూడా పద్దెనిమిదంటే అఫ్టాల్ పద్దెనిమిది పురాణాలు వ్రాశాడు. అవైనా కొత్త కథలా? తను కల్పించినవా? కావు. ఈ వ్యాస్ ఎవరి సహాయం లేకుండా ఓ ఏడాదిలో పద్దెనిమిది టెక్నికల్ పేపర్సు తయారు చేశాడు. పేపర్లు తయారు చేయటంలో సరికొత్త విధానాన్ని అవలంభించి అధిక పంటని పొందాడు. 'కష్టపడి పరిశోధనా వ్యవసాయం చేశాను. హెచ్చు పేపర్లను పొందాను. జై కిసాన్' అంటాడు అందరితో.

కాని అది పూర్తిగా సత్యం కాదు. వ్యవసాయం పరిశోధనలో కాకుండా కాయితాలతో సిరాతో చేశాడు.

ఉదాహరణకి ఇతను నిమ్మ రసం, వేపాకు రసం, పెద్ద రసాల రసం, మైసూరు రసం మొదలైన రసాల్లో కాంతి కిరణ ప్రసారం గురించి పరిశోధించాడు. నువ్వైతే వివిధ రసాల్లో కాంతి కిరణాలు ప్రసారం అని ఒకే ఒక పేపరు వ్రాసేవాడివేమో! వ్యాస్ ఏం చేశాడోతెల్సా?

*1. నిమ్మ రసంలో కాంతి కిరణం ప్రసరిస్తుందా?*

*2. వేపాకు రసంలో కాంతి కిరణ ప్రసార విశేషం.*

*3. పెద్ద రసం - కాంతి కిరణం*

*4. ప్రసరించే కాంతి కిరణంపై మైసూరు రసం ప్రభావం.*

ఈ విధంగా నాల్గు పేపర్లు వ్రాసి నాల్గు ఇండియన్ జర్నల్సుకి పంపించాడు. ఈ నాల్గు పేపర్ల మీద మేధావి పేరు కూడా ఉంది. మేధావి ఆశ్చర్యపోయాడు. కాని ఆ మర్నాడు నిజంగా మూర్ఛపోయాడు. ఎందుకంటే వ్యాస్.

1. కాంతి కిరణం తమగుండా ప్రసరించే టప్పుడు వేపాకు రసం, నిమ్మ రసం చూపించే తేడాలు.

2. పెద్ద రసాల రసం, మైసూరు రసాల గుండా కాంతి కిరణం ప్రసారం -

అనే మరో రెండు వ్యాసాలు తయారుచేశాడు. ఇవి మరో రెండు ఇండియన్ జర్నల్సుకు పంపాడు.

ఇక్కడ ఇండియన్ జర్నల్సు గురించి వో ముక్క చెప్పాలి. వీళ్ళకి ఒక పేపరు చదివి దాని బరువు తూచగల శక్తి సామర్థ్యాలు లేకపోలేదేమో కాని వోపిక తక్కువ. ఎవరైనా పంపిస్తే చాలు అచ్చేసుకుంటారు. ఇల్లా అచ్చయినవన్నీ సైంటిస్టులు లెక్కేసుకొవచ్చును.

రెండు రోజులు పోయాక మరో వ్యాసం వ్రాసి తీసుకు వచ్చాడు. అది 'ద్రవ పదార్థాలలో కాంతి కిరణం ఎల్లా ప్రసరిస్తుంది?' అన్నది. మేధావి మూగవాడైపోయాడు. ఇది ఫారిన్ జర్నల్‌కి పంపించాడు. వ్యాస్ ఇంకా కాంబినేషన్సు చేసి వ్యాసాలు వ్రాయగలడు కాని బావుండదని మానేశాడు.

ఫారిన్ జర్నల్లో మేధావి వ్యాస్‌ల పేపరు చదివిన వాళ్ళల్లో ఒకరు ఇండియన్ జర్నల్సులో పడ్డ వీళ్ళ పేపర్లు చదివి వున్నాడు. అతడు ఈ యేడు (7) పేపర్ల గురించి వ్రాస్తూ, 'ఈ ఏడింటి బదులు ఆ ఏడోది చాలునని, మిగిలినవి వ్రాయబడటానికి కారణం ఇండియాలో 'పబ్లిష్ ఆర్ పెరిష్' అన్న సూత్రం పాటించబడటం అనుకుంటాననీ, ఏమయినా ఇది విచారదాయకం' అని వ్రాశాడు. వ్యాస్ నవ్వి ఊరుకున్నాడు. ఇంటర్వ్యూల్లో పేపర్లే అడుగుతారు గాని వాటి పై వచ్చిన డిస్కషన్స్ అడగరు. అది అతనికి తెలుసు.

'ఇల్లా తను పేపరు మిల్లు తిప్పుతూ, తన తోటి విద్యార్థులకీ కిటుకులు నేర్పాడు. దానివల్ల రెండేళ్ళలో మేధావి పేపర్ల సంఖ్య బృహస్పతి పేపర్ల సంఖ్యని మించిపోయింది.

చూసిన వాళ్ళు ముక్కు మీద వేలేసుకున్నారు. బృహస్పతి శిష్యుల్లో ఒకడు మేధావి శిష్యులతో స్నేహం నటించి ఈ చిట్కా కనుక్కుని తనూ పేపరు మిల్లు తిప్పడం మొదలుపెట్టాడు. అవసరం ఇన్వెన్షన్‌కి తల్లి. అందుకని ప్రస్తుతం అవలంబిస్తున్న పద్ధతికంటే వేగంగా పేపర్లు తయారవగల పద్ధతిని వ్యాస్ కనిపెట్టాల్సి వచ్చింది, అదే ట్రేసింగ్ షీట్ల పద్ధతి. ముందరగా వో రెండు పేపర్ల విషయాన్ని సేకరించి అది వో రెండు ట్రేసింగ్ షీట్ల మీద మాటకి మాటకి బాగా చోటిస్తూ వ్రాస్తారు. ఆపైన ఒకదాని మీద ఒకటి పెట్టి ఆ రెండూ కలిసి చదివితే వచ్చేదాన్ని మూడో పేపరుగా వ్రాసుకుంటాడు. ఆ పైన పైనున్న ట్రేషింగ్ షీటుని కొంచెం ప్రక్కకి జరిపి ఆ కొత్త మాటల కాంబినేషన్‌ని నాల్గో పేపరుగా వ్రాస్తాడు. ఈ పద్ధతి చాలా ఫాస్టు. అయితే చిట్కా బృహస్పతి శిష్యులకి తెలిసిపోతుందేమోనని చాలా సెక్యూరిటీ మెషర్సు తీసుకున్నాడు. అందుకనే నీతో మాట్లాడలేదు.

'వ్యాస్‌లాంటి శిష్యుడిని సంపాదించటం కోసం బృహస్పతి తన తరుపున ప్రచారం చెయ్యమని ఓ ఎడ్వర్టయిజింగ్ ఏజన్సీని కోరాడు. వాళ్ళు ఏ చొక్కాలో ఏ ఘనుడున్నాడో అని రిసెర్చికి చేరటానికి వచ్చినవాళ్ళందరిని కలుసుకుని బృహస్పతి దగ్గర చేరమని చెప్తారు. ముందర వాళ్ళని కలుసుకో నిచ్చి అంత కంటే ఘనంగా మనస్సుకి నచ్చేలా మేధావి తాలూకు కంపెనీ వాళ్ళు మేధావి పేరు ప్రచారం చేస్తారు.

ఇద్దరు మంచి మేష్టర్లు ఆ సంస్థ అధికారుల తెలివి తక్కువ తనం వల్ల ఈ విధమైన రాజకీయ ప్రచారాల కేవిధంగా తీసిపోని ప్రచారాలకు దిగారు.

ఇంకపోతే బృహస్పతి, మేధావి కూడా పేపర్లు త్వరత్వరగా వ్రాయలేని శిష్యుల్ని ఏడాదయ్యేసరికి పుట్టిళ్ళకు తోలేసి, ఆ స్కాలర్ షిప్పులలో కొత్తవాళ్ళని తీసుకుంటున్నారు. గోపన్నా! తస్మాత్ జాగ్రత్త! కొత్త పేపర్లు వ్రాయటానికి కొత్త విషయాలుండక్కరలేదు. అల్లా కొత్త విషయాలు లేకుండా కొత్త పేపర్లు వ్రాయగల తెలివితేటలుంటేనే ఇక్కడ జేరు. లేకపోతే సామాన్లు సర్దు' అంటూ సిద్ధయ్య వ్యాసో పాఖ్యానాన్ని ముగించాడు.

కథ చెప్పటం ముగించి సిద్ధయ్య గోపన్న కేసి చూస్తున్నా ననుకుని, అతడింతకు ముందు కూర్చున్న కుర్చీ కేసి సాభిప్రాయంగా చూశాడు. కుర్చీ ఖాళీగా వుంది. గోపన్న ఆ సంస్థలో చేరడానికి వెళ్ళాడేమోనని సిద్ధయ్య కంగారు పడుతుంటే 'జట్కాబండి తెచ్చాను. వెంటనే బయల్దేరితే రైలుబండి అందుతుంది' అంటూ గోపన్న లోపలికి వచ్చాడు. సిద్ధయ్య పూపిరి తీసుకున్నాడు నిశ్చింతగా.

# మూడో మజిలీ

పశ్చిమంగా పోతున్న రైలు ఏదో జంక్షన్లో కుదుపుతో ఆగింది. 'ఈ స్టేషన్లో ప్రయాణం బ్రేకు చేద్దామా?' అని అడిగాడు సిద్ధయ్య. తిరిగొచ్చేటప్పుడు చేద్దాం. 'ప్రస్తుతం ఇంకా ముందుకు పోదాం' అన్నాడు గోపన్న, కాఫీ కోసం సిద్ధయ్య దిగబోతుంటే దారి కడ్డంగా, పుస్తకాల దొంతర్లొచ్చి పడ్డాయి. పుస్తకాల ఆసామి కేసి కోపంగా చూసి.

'ఏ బడా క్లాసు హై' అన్నాడు సిద్దయ్య. 'జీహా' అన్నాడు ఆ ఆసామి. మరో బొత్తి ఎక్కిస్తూ, 'ఇయ్యన్నీ దారి కడ్డంగా పెడ్తాడేంటీ మనిషి' అని విసుక్కున్నాడాయన.

'ఇంకొక్క బొత్తి ఉంది, అది కూడా ఎక్కించి సీట్ల కింద సర్దేస్తాను. అప్పుడు దారవుతుంది. అనక తీరుబడిగా దిగుదురు గాని. ఇక్కడ బండి చాలాసేపాగుతుంది,' అని తెలుగులో చెప్పాడు ఆ పుస్తకాల అబ్బాయి.

'అయితే అబ్బాయీ! ఈ దేశంలో కాఫీ దొరుకుద్దా?' అని అడిగాడు సిద్దయ్య.

అబ్బాయి హడిలి పోయాడు. 'ఏమండి మీకు బతకాలనిలేదా? లేక ఇటునుంచి కాశీ పోయి కాఫీ వదిలేస్తారా?' అని అడిగాడు.

'ఆ దరిద్ర మ్మాటలేంటి?' అన్నాడు సిద్దయ్య. అవన్నీ ముసలి తనంలో వినాల్సిన మాటలని, తనకింకా అది రాలేదని అందువల్ల అది రాకుండా అల్లాంటి మాటలు వింటే దరిద్రం వస్తుందని ఆయన నమ్మకం.

'ఏం లేదు, ఈ స్టేషన్లో కాఫీ తాగిన వాళ్ళు మళ్ళీ జన్మలో కాఫీ తాగరు. నే నీ స్టేషన్లో మొదటిసారి దిగినప్పుడు కాఫీ తాగాను. మళ్ళీ తాగితే ఒట్టు, ఈ ఏడేళ్ళలో ఒక్కసారైనా,' అన్నాడా అబ్బాయి, మూడో బొత్తి ఎక్కిస్తూ.

సిద్దయ్య కాఫీ వేట మానేసి 'చా'తో తృప్తిపడి సీట్లో జారగిలబడ్డాడు. అప్పుడా పుస్తకాల అబ్బాయి పుస్తకాల బొత్తులు సీట్ల కింద సర్దాడు.

'ఏంటవి?' ప్రశ్నించాడు సిద్దయ్య:

'థీసిస్సులు'

'ఆ వెవడిగ్గావాలి గాని అసలు సరుకుంటే తియ్యి' అన్నాడు సిద్దయ్య. సూక్ష్మగ్రాహి అయన గోపన్న మావయ్య మాటల కడ్డు పడటంకంటే వ్యర్థమైనపని ఇంకోటి లేదని ప్రయాణం మొదటి రోజునే గ్రహించి ఊరుకున్నాడు.

'అసలు సరుకంటే?' పుస్తకాలు అబ్బాయి ఎదురు ప్రశ్నించాడు.

'అసలు సరుకు ఏమిటో తెలియకుండా పుస్తకాల వ్యాపారమేం చేస్తొన్నావయ్యా? థీసిస్సులు ఎవడు కొంటాడు? సెక్సు బుక్కులుంటే బయటికి తియ్యి.'

'అమ్మమ్మ, పెద్దవారు పొరపాటు పడ్డారు. నేను పుస్తకాలమే కుర్రాణ్ణి కాను. ఇవన్నీ నా స్వంత పుస్తకాలు, ఎక్కడా పారేసుకో లేక నా వెంట తీసుకు వెళ్తున్నాను సెంటిమెంటువల్ల. మిమ్ములనన్నవసరంగా ఆశ పెట్టినట్టున్నాను' అంటూ క్షమాపణలు చెప్పుకున్నాడు.

సిద్దయ్య కింక ఆ విషయంలో ఇంటరెస్టు పోయింది. కిటికిలోంచి బయటికి చూడటం మొదలు పెట్టాడు. అప్పుడు గోపాల్రావ్ రంగంలోకి దిగాడు. 'మీ రందరి థీసిస్సులు కలెక్టు చేసి పర్సనల్ లైబ్రేరి ఏర్పాటు చేసుకుంటున్నారా?' అని వినయంగా, గౌరవంగా అడిగాడు.

'అబ్బే, ఇవి వేరెవ్వరో వ్రాసనవి కావండి. ఇవన్నీ నేను వ్రాసినవే'.

'అయ్యబాబోయి. అన్నీ థీసిస్సులే! నేను కూడా ఒకటి వ్రాద్దామని సరదా పడుతున్నాను.

మా మావయ్య- అంటే ఇందాక మీతో మాట్లాడిన ఆయన, 'ఇక్కడొద్దు అమెరికాలో వ్రాయి ' అంటాడు. మిమ్మల్ని చూస్తే నాకు ధైర్యంగా ఉందండి. మీరిండియాలోనే ఇన్ని థీసిస్సులు వ్రాస్తే కనీసం నేను ఒక్కటంటే ఒక్కటి కూడా వ్రాయలేనా?

'వ్రాయొచ్చు. కాని మీ మావయ్యగారు చెప్పిందే సబబైన పని.'

సిద్దయ్య ఉలిక్కిపడ్డాడు. ఈ పుస్తకాలమ్మిని అబ్బాయిలో ఇంత విచక్షణా జ్ఞానం ఉందా అని ఆశ్చర్యపోయి, 'అల్లా చెప్పు నాయనా! చచ్చి నీ కడుపున పుడతా!' అన్నాడు.

'వీలవదు క్షమించండి. ఇద్దరు పిల్లలతో విసుగెత్తిన మా ఆవిడ మూడో కాన్పులో ట్యూబెక్టమీ చేయించుకుంది. పైగా ఆ మధ్య మా పిల్లలు ట్రాన్సిస్టరు కావాలని గోడవ చేస్తే నేను వేసెక్టమీ చేయించుకున్నాను. అందుచేత మీరు మరో కడుపు చూసుకుంటే మంచిది. మరోలా అనుకోకండి' అన్నాడు పుస్తకాల అబ్బాయి.

'పోన్లెండి, దానికి మీరేం చేస్తారు. మా మావయ్య మరో జన్మకి బస మరెక్కడయినా చూసుకుంటాడు లెండి. ఇంతకు మీరు కూడా నన్నమెరికా పొమ్మంటున్నా రెందుకు సార్?' అన్నాడు కుతూహలం, భక్తి సమపాళ్ళలో కలిపి గోపాల్రావ్.

'నా కథ వింటే అల్లా ఎందుకన్నానో మీకే తెలుస్తుంది అన్నాడు పు.అ.

'అయితే నీ కథ తప్పకుండా చెప్పు బాబు! చచ్చి నీ కడుపున...!' అంటున్న సిద్దయ్య నాపి,

'వీల్లేదు మొర్రో అంటే వినరేమండి! అయితే నే కథ చెప్పను.'

'వద్దు, కథ అపొద్దు. చెప్పండి, నేను చావను' అన్నాడు సిద్దయ్య.

'నా పేరు గజని, అది మా స్నేహితులు నా కిచ్చిన బిరుదు. అవి నేను వ్రాసిన థీసిస్సులు' అని డ్రమెటిక్‌గా ఆగి -

'అవన్నీ తిరిగి వచ్చాయి. అదే పనికి రావని తిరిగి వచ్చాయి.' అని యస్వీ ఆర్ పద్ధతిలో డైలాగు డెలివర్ చేశాడు పు.అ.

'అవి తిరిగి వచ్చిన వైనమే నేనుచెప్పబోయే కథ' అంటూ మొదలుపెట్టబోయి. 'ముందుగా మీకు నేను సత్యహరిశ్చంద్రుడి కథ చెప్తాను' అని మొదలు పెట్టాడు.

## 4. డాబూ కిట్టించని సత్య హరిశ్చంద్రుని కథ

సెక్స్ సెన్సయిన ఇంట్యూషన్‌కి మారు పేరు మేఘనాథ్. చిన్నప్పుడు మేఘాల మీద రీసెర్చి చేస్తుండేవాడు. పెద్దయ్యాక అందరి ప్రొఫెసర్లలాగానే ఎడ్మినిస్ట్రేషన్‌తోను, కాంగ్రెస్ మినిష్టర్ల రాకల తోను తీరక రిసెర్చి మానుకుని విద్యార్థుల్ని గైడు చేస్తున్నాడు. ఏమని చెప్పానిందాక! ఆఁ.... ఆయన చిన్నప్పుడు మేఘాల మీద రిసెర్చి చేస్తుండేవారు. అంటే మనలా ఉన్న రోజుల్లో, అంటే అప్పటికీ సబ్జెక్టు మర్చిపోలేదని అర్థం. చాలా విషయాలు ఆయన చేతి వేళ్ళ మీద అంటే ఫింగర్ టిప్స్ మీదుండేవి. తెలుగులో దీన్నే కరతలామలకం అని కాబోలు అంటారు. అంటే చేతిలో ఉసిరికాయ అన్నమాట. అంతేనా? కాకపోతే ఉస్తికాయ! ఏదో ఒక కాయ నా తలకాయ. ఆయనకు సబ్జెక్టు గుర్తుండడంచేత రిసెర్చిలో తప్పులు చేసి

దిద్దుకోవాల్సిన అవసరం ఉండేది కాదు. ఎక్కడి చూచినా ఆయన పేరే! ఎవరు చెప్పుకున్నా ఆయన పేరే. పైగా ఈయన ఇంట్యూషన్‌తో ఊహించిన లాస్-అంటే సూత్రాలు నిజమైపోతూ ఉండేవి. ఇంట్యూషన్, అంటే తెలుగులో... ఏదో ఒకటి.. దాని మీద అందరికి గౌరవం పెరిగింది.

అందరితోపాటు ఆయన కూడ తన ఇంట్యూషన్ మీద గౌరవం పెంచుకున్నాడు. ఆపైన ఓ కన్విక్ష నేర్పరుచుకున్నాడు. కన్విక్షనంటే తెలుగులో గట్టి నమ్మకం అన్నమాట. నా కిల్లా ఇంగ్లీషులోది తెలుగులో చెప్పడం అంటే సరదా. చెప్పగలిగినప్పుడు బోల్డు గర్వంగా ఫీలవుతాను.ఫీలవడం అంటే... రేపు ఆంధ్రా యూనివర్సిటీ వాళ్ళు థీసిస్సులు తెలుగులో వ్రాయాలంటే స్టూడెంట్సు చస్తారు... ఇంతకు మేఘనాథ్‌గారి కన్విక్ష నేమిటంటే తను ఇంట్యూషన్ వల్ల చెప్పింది నిజమైతీరుతుందని. మరికొన్నాళ్ళకి, ఏదైనా విషయం చెప్పి 'దిస్ ఈజ్ మై ఇంట్యూషన్' అంటే చాలు దాంట్లో ఉన్న మంత్రశక్తి వల్ల తనన్నది కరెక్టయిపోతుందని నమ్మకం ఏర్పడింది. మరి కొన్నాళ్ళకి తను ఈ శతాబ్దంలో పుట్టాల్సినవాడు కాదని, ఏదో బ్రహ్మ పొరపాటువల్ల అల్లా జరిగిందని, తన నోటంట వచ్చే ప్రతి మాట తరువాతి కాలంలో శాస్త్రీయంగా రుజువు చేయబడుతుందని, అప్పుడు ప్రజలు 'దీన్ని మేఘనాథ్‌గారు రెండువందల ఏళ్ళ క్రితమే ఊహించా'రని చెప్పుకుంటారని నమ్మటం మొదలు పెట్టాడు. ఆయనతన్ని జూల్‌వెర్న్‌తోను, హెచ్.జి. వెల్సుతోను పోల్చుకుంటాడు. అసలు చిక్కు ఇక్కడే మొదలైంది.

ఎల్లా అంటే, ఆయన ఆ రోజు నుంచి తన స్టూడెంట్సుని పట్టుకుని, తమ పార్టీల్లోని మీటింగుల్లోను, నిద్రలోను, ఆఫీసులోను యధాలాపంగా అన్నవన్నీ ఇంకా అప్పటికి కనుక్కోబడని సత్యాలని, అవన్నీ సశాస్త్రీయంగా కనుక్కునే బాధ్యత వాళ్ళదని, అల్లా చేస్తే మేఘశాస్త్రంలో మేఘనాథ్ పేరు, ఆయన స్టూడెంట్సు పేర్లు సువర్ణాక్షరాలతో లిఖింపబడుతాయని చెప్పి వాళ్ళ నెత్తిన ఆ బరువు పెట్టాడు.

అందులో అతి ముఖ్యమైనది మేఘనాథ్ థీరీ ఆఫ్ క్లౌడ్సు. దాన్ని ఆయన స్వంత భార్య పుట్టినరోజు నాడు సిగరెట్టు కాలుస్తూ పాస్ట్యులేట్ చేశాడు. ఆ పైన ఓ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్సులో ప్రపోజు చేశాడు. ఆయన దగ్గర పన్జేసే కొందరు విద్యార్థులు ఎక్స్‌పెరిమెంట్లు చేసి ఆయన థీరీని సపోర్టు చేస్తూ పేపర్లచ్చేశారు. అవి ప్రపంచఖ్యాతి పొందాయి. ఆపైన ఆయన పేరు పుస్తకాల్లో ఎక్కింది. నేను చదువుకున్న పుస్తకంలో ఆయన థీరీ గురించి చదివాను.

ఎమ్మెస్సీ పూర్తి చేసి ఎకాఎకిని ఈ వూరు వచ్చాను, ఆయన్దెగ్గర పిహెచ్.డి., చేద్దామని. సరిగ్గా నే వచ్చే సమయానికి ఆయన విదేశాల్లో లెక్చర్లిస్తున్నాడు. ఏం చెయ్యాలో తెలియక లాబ్‌లో తిరుగుతుంటే మరో తెలుగు కుర్రాడు కన్పించాడు. తన పేరు ఎస్.హరిశ్చంద్రుడు అని చెప్పుకుని.

'మీరు మరో మిడతా' అని అడిగాడు.

'అంటే' అన్నాను.

'అంటే మేఘనాథ్ అన్న దీపం చేత ఆకర్షించబడ్డ శలభానివా? అని అర్థం.'

'కాదు, సూర్యుడి చేత ఆకర్షింపబడ్డ పద్మాన్ని' అన్నాను.

అతను పగలబడి నవ్వాడు. ఆ శబ్దం మేఘాలు ఒరుసుకున్నప్పుడయ్యే శబ్దంలా ఉంది. 'ఏం చూసి ఆయన్ని సూర్యుడితో పోల్చావు తమ్ముడూ! లేక నీకు సూర్యుడి మీద కోపం ఉందా?' అని అడిగాడు.

'ఏం చూశా? ఆయన థీరీ ఒక్కటి చాలు, ఆయన్ని సూర్యుడితో పోల్చేందుకు. ఆ సూర్యుడు పగలు మాత్రమే ప్రకాశిస్తాడు. ఆయనకి దివారాత్రులతో పని లేదు.'

'నువ్వు తెలుగువాడివి కనుక, ఆయన దేశంలో లేడు కనుక నేను నీకో తమాషా చూపిస్తాను' అంటూ టేబుల్ డ్రాయర్లలోంచి వో కట్ట గ్రాఫులు తీశాడు. అవి నాకు చూపిస్తూ 'ఇందులో థిక్ లైన్సు ఆయన థీరి ప్రకారం గీసినవి. ఈ పాయింట్లు నా ఎక్స్‌పెరిమెంట్ల వల్ల వచ్చినవి' అన్నాడు.

'పాయింట్లన్నీ థీరెటికల్ వాల్యూస్‌కి మైలు దూరంలో పడ్డాయి' అన్నాను, ఆశ్చర్యపోతూ! 'అందులోను, ఇది లాగ్‌లాగ్ ప్లాట్. మరింతకు పూర్వం ఆయన్దెగ్గర పన్జేసిన స్టూడెంట్సు ఎక్స్‌పెరిమెంటల్ ఎగ్రిమెంటుందన్నారే!'

'అందులో ఒక్క వెధవా నిజంగా ఎక్స్‌పెరిమెంట్లు చెయ్యలేదు. మేఘనాథ్‌గారి థీరీ తప్పవుతుందా? దానికెన్ని గుండెలు అంటూ కిట్టించారు. ఆ విషయం నేను ఆయనకి చెప్పాను, ఆయన ఒప్పుకోలేదు. ఆ రోజుల్లో వాళ్ళు ఎక్స్‌పెరిమెంట్లు చేసి ఉండటానికి వీల్లేదని సహేతుకంగా రుజువు చేశాను.'

'ఎల్లా చేశారు?'

'ఏముంది? వాళ్ళు వాడామని పేపర్లలో వ్రాసిన ఎక్విప్‌మెంటు వాళ్ళీ దేశాన్ని పై దేశాల కోసం వదిలిపెట్టి వెళ్ళిన కొన్నాళ్ళకి-అంటే నేను వచ్చిన కొన్ని రోజులకి, ఫారినెక్స్ఛేంజి లాంటి బాలారిష్ట దోషాలను గడిచి, మా లాబ్‌ని చేరింది. ఆయనకి తన తప్పు ఒప్పుకునే గుండెధైర్యం లేదు. అక్కడే వచ్చింది గొడవ. అందుకనే ఫారినర్సుకి మన ఇంటెగ్రిటీ మీద నమ్మకం లేదు. అందుచేత ఈ అబద్దాల శాస్త్రాల పచారానికి నువ్వు దూరంగా ఉండు. మీ ఊరు వెళ్ళిపో!' అని సలహా ఇచ్చాడు.

'అదేం లాభం లేదు. ఇప్పుడు మా ఊరు వెళ్తే అందరు మేఘనాథ్‌గారు నన్ను తీసుకోడానికి నిరాకరించారని చెప్పుకుని ముసురుస్తారు. మంచో చెడో ఇక్కడే ఉంటాను'. అన్నాను.

'అయితే మేఘనాథ్‌గారికి తెలియని సరికొత్త టాపిక్ మీద దేనిమీదైనా రిసెర్చి చెయ్యి. నాతో మాట్లాడినట్టు ఎవరికి చెప్పకు' అంటూ హెచ్చరించాడు.

ఇది జరిగిన వారం రోజులకి మేఘనాథ్‌గారు పై దేశాల నుంచి తిరిగి వచ్చారు. అక్కడ ఆయనకి, ఆయన థీరీకి బ్రహ్మరథం పట్టారుట. అందుకని ఆయన థీరీయే రైటు, హరిశ్చంద్రుడి ఎక్స్‌పెరిమెంట్లే తప్పన్న నిర్ణయం తీసుకున్నాడు. ఇంకో వారం రోజులకి సత్యహరిశ్చంద్రుడు లాబ్ వదలి వేశాడు.

అందుచేత, నేను ఎందుకైనా మంచిదని, మేఘనాథ్ గారికి అసలేం తెలియని ఫీల్డులో వో టాపిక్కు సెలక్టు చేసుకున్నాను.

## 5. తిరిగొచ్చిన థీసిస్ కథ

గజనీ కథ కొనసాగించాడు.

'నేను మేఘనాథ్ గారి వీక్‌నెస్‌ని త్వరలోనే పోల్చుకున్నాను. మన మేం చేసినా సరిగ్గా మీరు చెయ్యమనట్టే చేశాననడం మనకే రిజల్ట్సు వచ్చినా అచ్చు మీరు ఇంట్యూషన్ ప్రకారం ప్రిడిక్టు చేసినట్టే రిజల్ట్సు వచ్చాయనటం చేస్తే చాలు ఆ ప్రగల్భజీవి బోల్తా పడ్డాడు. ఒకవేళ తనల్లాంటి పనేం చెయ్యలేదని పోల్చుకున్నా తనకు ఆయాచితంగా వచ్చే క్రెడిట్ పోగొట్టుకోడు, కొన్నాళ్ళకి ఆయన ఇంట్యూషనులు తను బయటకి చెప్పకుండానే నా కర్థమై పోతున్నాయన్న భ్రాంతి ఆయనకి కలిగించాను.

'ఇల్లా ఎంతో తెలివితేటలతో ప్రవర్తించినా నా తలరాతెవ్వరు తప్పించలేక పోయారు.' అంటూ కాసేపు గజనీ విచారిస్తూ కూర్చున్నాడు.

చెట్టంత మనిషి బాధపడుతుంటే మాట్లాడించటం ఏం బావుంటుందని గోపాల్రావ్ మాట్లాడించలేదు.

గజినీ కాస్సేపటికి 'ఇందాక ఏమంటున్నాను' అని అడిగాడు.

'తమ తల వ్రాతన్నారు' అంటూ అందించాడు గోపాల్రావ్.

'అవును, నా తలరాతన్నాను. వ్రాతనలేదు. అందుకే కాబోలు బ్రహ్మ నా నొసట పిహెచ్.డి. యోగం రాయలేదు. నేను చచ్చీ చెడి థీసిస్ వ్రాస్తే అందులో ఏ ముండి చచ్చిందో మేఘనాథ్‌గారి కర్థమై చావలేదు. ఇన్నాళ్ళుగా నేను చెప్తున్నవి విని, తలాడించాడు కాని తల కెక్కించుకోలేదు. అందుకనే దాన్ని ఉట్టినే చదివాడు కాని విలువ కట్టలేక పోయాడు. అందుకని అటువంటి పరిస్థితుల్లో అందరు గైడ్సు చేసినట్టే ఫుల్ స్టాపులు కామాలు దిద్దాడు. దాంతో నా థీసిస్ ఎప్రూవ్ అయింది. అక్కడికి రూల్సు ప్రకారం థీసిస్ ఇద్దరు ఫారినెగ్జామినర్సు దగ్గరకు వెళ్తుంది. ఇద్దరూ ఒప్పుకుంటే డిగ్రీ వస్తుంది. ఇద్దరూ ఒప్పుకోకపోతే మరో యూనివర్సిటీకి స్టూడెంటు మకాం మార్చేయాలి. అందులో ఏ ఒక్కరు ఒప్పుకోక పోయినా దాన్ని వారు చెప్పిన విధంగా మార్చి వ్రాయాలి. మొత్తం ఆరు శాల్తీలు తయారు చేస్తే రెండు ఎక్జామినర్సుకి, ఒకటి మనకి, ఒకటి గైడుకి, మరొకటి ఆఫీసుకి ఇంకొకటి లైబ్రేరికి, మధ్యలో ఎగ్జామినర్సుని మార్చడానికి వీల్లేదు. అల్లా చేస్తే థీసిస్‌ని రిజెక్టు చేసిన ఎగ్జామినర్‌ని ప్రొఫెసర్లు రిజెక్టు చేస్తారని, అల్లా చేస్తే చెత్త థీసిస్సు లన్నింటికి పిహెచ్.డి. వస్తుందని ఈ యూనివర్సిటీ నమ్మకం.

నా ఎగ్జామినర్సులో ఒకడు అమెరికన్. పేరు రోజ్ వుడ్. రెండోవాడి పేరు హేవుడ్. వీడు ఆస్ట్రేలియన్. వీళ్ళిద్దరిని మేఘనాథ్ ఆ మధ్య విదేశాలకి వెళ్ళినప్పుడు కలుసుకున్నాడు. వాళ్ళిద్దరికి పరిచయం ఉందని మేఘనాథ్ గారికి తెలియదు. మా యూనివర్సిటీ అధికారులు వాళ్ళిద్దరిని ఏగ్జామినర్సుగా ఉండమని కోరుతూ, ఫలానా గజనీ థీసిస్ ప్రపంచంలో ఉన్న బెస్టు యూనివర్సిటీల థీసిస్‌ల స్టాండర్డులో ఉంటేనే పిహెచ్.డి. ఇమ్మని లేకపోతే వద్దని వ్రాసింది.

వాళ్ళిద్దరు ఒప్పుకున్నారు, ఎగ్జామినర్సుగా ఉండటానికి. రోజ్‌వుడ్ థీసిస్ అందిన నెల

రోజుల్లో ఆ థీసిస్ ప్రపంచంలోని బెస్టు యూనివర్సిటీల్లో ఒకటైన తన యూనివర్సిటీలో పి.హెచ్.డి. తెచ్చుకునే థీసిస్‌ల స్టాండర్డులో ఉందని, కనుక డిగ్రీ ఇవ్వచ్చునని వ్రాశాడు. హేవుడ్ ఎన్నాళ్ళకీ ఏమీ వ్రాయలేదు. దాంతో మేఘనాథ్‌గారు హేవుడ్‌కి, 'శ్రీ రోజ్‌వుడ్‌గా రప్పుడే డిగ్రీ ఇవ్వచ్చునని వ్రాశారు. ఈ థీసిస్ వాళ్ళ యూనివర్సిటీలో ఆమోదించే థీసిస్‌ల స్టాండర్డుకు ఉందని వ్రాశారు. మీరు కూడా త్వరలో అలాగే వ్రాయాల్సింది' అని ఉత్తరం వ్రాశారు.

అసలు నిజానికి హేవుడ్ కొంతవరకు పని తొందరలో నా థీసిస్ మాట మర్చిపోయాడు. కాని ఆ ఉత్తరంతో గుర్తుకు తెచ్చుకున్నాడు. ఈ ఉత్తరం అందిన సమయంలో హేవుడ్ దొరకి రోజ్‌వుడ్ దొరకి అంత సయోధ్యగా లేదు. అందుకని హేవుడ్ దొర తనకు దేవుడిచ్చిన అవకాశాన్ని వదులుకోదల్చుకోక 'ఇది రోజ్‌వుడ్ గారి యూనివర్శిటీలో డిగ్రీలు వచ్చే థీసిస్‌ల లెవల్‌లో ఉందని నేనూ ఒప్పుకుంటున్నాను. కాని మా యూనివర్సిటీ లెవెల్‌కి రావాలంటే మాత్రం ఇంకా ఎక్కువ వర్కు చెయ్యాలి' అని వ్రాశాడు.

దాంతో తప్పనిసరిగా, నేను మరికొంచెం వర్కు చేసి, తిరిగి సబ్మిట్ చేశాను. ఈ సారి హేవుడ్ దొర క్రితంసారి అనవసరంగా నాకు రోజ్‌వుడ్ మీదున్న కోపాన్ని గజనీ మీద చూపించాను' అని నొచ్చుకుని థీసిస్ అందిన మర్నాడు డిగ్రీ ఇవ్వమని వ్రాశాడు. అయితే రెండుసార్లూ అతగాడు థీసిస్‌ను చదవలేదన్నది వేరే విషయం. కాని ఈసారి రోజ్‌వుడ్ రిపోర్టు అన్యాయంగా వచ్చింది. 'హేవుడ్‌గారి సలహా ప్రకారం థీసిస్‌ను లావుగాచేసి సబ్మిట్ చేశాడు గజనీ. లావుగా ఉన్న థీసిస్‌లలో చెత్తా చెదారం వుండే విషయం అందరికీ తెలిసిందే. ఇటువంటి వాటికి ఆస్ట్రేలియాలో పిహెచ్.డి ఇవ్వచ్చును గాని మా దేశంలో ఎమ్మెస్సి కూడా ఇవ్వం' అని.

ఇప్పటికే మొత్తం నా దగ్గర ఓ డజను శాల్తీలు తయారయ్యాయి. అందుకని ఒక సంవత్సరంపాటు జాగ్రత్తగా ఆలోచించి మరీ పెద్దది. మరీ చిన్నది కాని థీసిస్ తయారు చేశాను. నేను చాలా తెలివైన వాణ్ణని సంతోషించాను. కాని ఈసారిద్దరు వుడ్డు దొరలు ఎవరి జాగ్రత్తలో వాళ్ళు ఉండి ఇద్దరూ థీసిస్‌ను రిజెక్టు చేశారు. ఈ కొత్తగా రిజెక్టయిన థీసిస్ శాల్తీలతో వెరసి మొత్తం పద్దెనిమిది శాల్తీలు నా దగ్గరకు చేరాయి. అవే మీ ఎదుటి సీటు కిందనున్న గ్రంథరాజాలు, ఇప్పుడు చెప్పిందే తిరిగొచ్చిన నా థీసిస్‌ల కథ' అంటూ ముగించాడు గజని.

'ఎందుకైనా మంచిది, మీరు బ్రూసు - సాలీడు కథ చదవండి' అన్నాడు గోపాల్రావ్.

'లాభంలేదు, చదివాను. బ్రూసు కథలో ఎగ్జామినర్సు రారు' అన్నాడు గజనీ.

'తిరిగొచ్చేటప్పు డీ జంక్షన్లో దిగుదామంటావురా అబ్బీ?' అని అడిగాడు - సిద్దయ్య-

'అనవసరం మావయ్యా!' అన్నాడు గోపన్న.

ఆ పైన గజనీకి గోపాల్రావు 'థాంక్సు' చెప్పాడు. సిద్దయ్య చచ్చి అతని కడుపున పుడతానని చెప్పాడు. గజనీ మొహమాటం లేకుండా వద్దన్నాడు.

# నాలుగో మజిలీ

మిగిలిన మూడు దిక్కులు అచ్చి రాలేదని ఉత్తర దిక్కుగా ప్రయాణం చేసి ఢిల్లీ చేరారు సిద్ధయ్య ఆయన మేనల్లుడు గోపన్నాను. అక్కడ చుట్టాలింట్లో దిగారు. ఆ చుట్టానికి సెంట్రల్ గవర్నమెంటులో పెద్ద ఉద్యోగం. ఆయనకి తెలియని కథా కమామీషులు లేవు. అయితే అయన్ది ప్రభుత్వోద్యోగం కనుక ఆ కథ లందరితో చెప్పడానికి వీల్లేదు. అందుకని చుట్టా లెవరైనా వస్తే మొన్న పేపర్లో ఆ విషయం గురించి అల్లా చదివారుగాని అసలు కథిది. ఫలానా స్టేటుమెంటు ప్రెస్సు కిచ్చినప్పుడు ఫలానా మినిష్టరు తాగున్నాడు. ఫలానా సినిమా తార ఇల్లు పోలీసులు రెయిడు చేసినప్పుడు గోడ దూకి పారిపోయినది వో మాజీ హైకోర్టు జడ్జి. ఇల్లా చెప్పుకుంటూ పోతాడు. వీళ్ళు వెళ్ళిందాదివారం కనుక ఇవన్నీ చెప్పాడు. సిద్ధయ్యకా సినిమా తార పేరు ఊరు తెలుసుకుందామన్న సరదా ఉన్నా, పరాయి పెద్ద మనిషి- అందులోను తెలిసిన వాడు - ఏమనుకుంటాడో అని భయపడి ఊరుకున్నాడు.

సోమవారం పొద్దున్నే గోపాల్రావ్ వీథిలో పడ్డాడు. అసలుద్దేశం ఆ ఊళ్లో తనకేమైనా రిసెర్చి చేసే అవకాశం ఉందేమో విచారిద్దాం అని. అయితే గోపాల్రావుకి కూడా, యంగ్‌మాన్ అవడం చేత, హృదయముంది. అది అందమైన అమ్మాయిల్ని చూస్తే గోపాల్రావ్ మాట వినకుండా రెపరెప లాడుతుంది. ఢిల్లీలో అమ్మాయిల అలంకరణ గోపాల్రావ్ అనే యంగ్‌మాన్ మతిని పోగొట్టింది. అల్లా మతి పోయిన గోపాల్రావ్ కళ్లని మీసాలు లేని అమ్మాయి పంజాబీ డ్రెస్సులో ఉండి ఆకర్షించింది. అతనాశ్చర్యపోయాడు. ఏ సౌతిండియన్ బ్యూటీయో ఆ డ్రెస్సులో అందం వలకబోస్తూ ఉండి వుండాలని వూహించాడు. అయినా వలకబోస్తున్నది అందం కనుక అది నేల పాలు కాకుండా కళ్ళతో తాగేస్తూ వెంటబడ్డాడు. ఆ అమ్మాయి బస్సెక్కింది. గోపాల్రావ్ కూడా ఎక్కాడు. ఆ అమ్మాయి ఓ బజారులో దిగింది. అతనూ దిగాడు. అమ్మాయి నడుస్తూ నడుస్తూ వో గవర్నమెంటాఫీసు దగ్గరమాయమైంది. ఆ అమ్మాయి కోసం వెతుకుతున్న గోపాల్రావ్‌కు వో యువకుడు పొడుగాటి కాయితంతో సిగరెట్టు వెలిగించుకోడం కనబడింది.

గోపాల్రావ్ ఆ వింతను చూస్తూ పంజాబి అమ్మాయి సంగతి మరచిపోయాడు. కుతూహలం చంపుకోలేక ఆ యువకుడి దగ్గరకు నడిచి 'ఇదేమిటి సార్?' అని అడిగాడు.

'అవును, దీన్ని అయిదేళ్ళు శ్రమపడి తయారు చేశాను. అయితే ఇది ఆఖరికి ఒక్కటంటే ఒక్కటి మాత్రమే సిగరెట్టు వెలిగించుకోడానికి పనికొచ్చింది' అని జవాబిచ్చాడు ఆ యువకుడు.

'చాలా ఎక్స్‌పెన్సివ్',

'అవును దీనికోసం ప్రభుత్వం చాలా డబ్బు తగలేసింది. అది చాలక దీనిమీద నేనో రెండు వేలు తగలేశాను. దీన్ని తయారు చెయ్యటానికి అయిదేళ్ళు పట్టింది.'

'అయ్య బాబోయ్! అంత ఖరీదే?'

'మరేమిటనుకున్నావ్?'

'అందులో ఏముందండి, మండే వజ్రాలా?'

'కాదు. నా ప్రాణం. అది నా పిహెచ్.డి. డిగ్రీ. అయితే బొత్తిగా ఇండియన్లైపోడం చేత సిగరెట్టు వెల్గించుకోటానికి తప్ప పనికిరాలేదు.' అన్నాడా యువకుడు బాధపడుతూ.

'మరీ మరీ అల్లా ఇండియన్ పిహెచ్.డి.ని చిన్నబుచ్చటం బాగా లేదు' అన్నాడు గోపాల్రావ్ బాధగా, అది అతని నమ్మకానికి గొడ్డలిపెట్టు.

'ఎవరూ కావాలని స్వంత డిగ్రీని అవమానం చేసుకోరు. కాని తప్పలేదు. ఈ ఆఫీసు గుమ్మాని కవతలి వైపున్న రాతి ఫలకం చూస్తే నువ్వే ఒప్పుకుంటావు' అంటూ ఏదో వ్రాసి ఉన్న రాతి ఫలకాన్ని చూపించాడు.

గోపాల్రావ్ రాతి ఫలకం దగ్గరకు వెళ్ళి ఇల్లా చదివాడు.

| | విదేశీ మారకం రేటు |
|---|---|
| *1. అమెరికన్ కిలోగ్రాముకి* | *15 ఇండియన్ కిలో గ్రాములు* |
| *1. ఇంగ్లీషు పౌండుకి* | *5 ఇండియన్ కిలోగ్రాములు* |
| *1 జర్మన్ కిలోగ్రాముకి* | *5 ఇండియన్ కిలోగ్రాములు* |
| *1 ఫ్రెంచి కిలోగ్రాముకి* | *3 ఇండియన్ కిలోగ్రాములు* |
| *1 * ఇతరదేశాల కిలోగ్రాముకి* | *2 ఇండియన్ కిలోగ్రాముల* |

* అరబ్బు ఆఫ్రికన్ దేశాలు మినహాయించి. అంకెలు మాని బరువుతో చెప్పండి.

గోపాల్రావ్ ఆశ్చర్యపోయాడు. ఒక దేశంలో కిలోగ్రాము తూగింది, మరో దేశంలో మరోలా తూగుతుందా అని (పాఠకులు తొందరపడి కేకలు వేయొద్దు. గురుత్వాకర్షణలో ప్రదేశానికి ప్రదేశానికి తేడా ఉన్నా ఇంతలా ఉండదన్న విషయం గోపాల్రావ్‌కి తెలుసును). ఈ వింత గురించి ఆ యువకుడి నడుగుదామని వెళ్ళి చూస్తే ఆతడు లేడు.

ఈ సందేహాలతో సతమతమౌతూ ఇంటికి చేరిన గోపన్నకి సిద్దయ్య మావ, అవి తీర్చటానికి ఏ విధంగా ప్రయత్నించక, 'చుట్టంగారొస్తే అన్నీ తెలుస్తాయి' అన్నాడు బద్ధకంగా. అందుకని ఆయన వచ్చాక ఆయన్దగ్గరెత్తాడీ విషయాన్ని, ఆయన వెంటనే ఏదో నంబరు డయల్ చేసి ఫోన్లో అవతలి వాళ్ళకి ఆ కథంతా చెప్పాడు. ఫోనుమూతికి చెయ్యడ్డుపెట్టి గోపాల్రావుని ఆ యువకుడి ఎత్తు, బరువు, రంగు, పుట్టుమచ్చలు అడిగి అతనికి గుర్తున్నంతవరకు చేస్తే అవి ఫోనులో అవతలవాళ్ళకు చెప్పి 'ఆఁ ఆఁ రేపు మా ఆఫీసుకు ఫోను చేసి చెప్తారా? బాగుంది అట్లాగే చేయండి 'అంటూ చుట్టం ఫోను పెట్టేశాడు.

'అయితే ఆ కథ రేపు చెప్తారా?' అన్నాడు హతాశుడై గోపాల్రావ్.

'అక్కర్లేదు. ఇవాళ సగం చెప్తాను. వచ్చేరోజు పై కథ చెప్తాను. ఇవాళ చెప్పే సగం కథ పేరు 'రాతిఫలకం కథ' అంటూ ఆయన మొదలు పెట్టాడు.

## 6. రాతిఫలకం (ఈక్వివలెంటు పేపర్ల) కథ

నువ్వు చూసిన రాతి ఫలకం గుమ్మం పక్కన గలిగిన ఆఫీసు గురు ప్రభుత్వోద్యోగుల

ఎన్నిక శాఖ వారి కార్యాలయం. వారు పెద్ద ఉద్యోగాలలోకి ప్రజల్ని తిన్నగా కూడా తీసుకుంటారు. అనుభవము లేని ముడి విద్యార్థుల కిది ఓ కల్పవృక్షం. ఆ శాఖ వాళ్ళకా మధ్య అందరికి న్యాయం సమంగా చెయ్యాలన్న కోరిక కలిగింది. అయితే వాళ్ళకి కాండిడేట్సు పరిశోధనాశక్తి కలిగి ఉండాల్సిన ఉద్యోగాల విషయంలో ఇబ్బంది వచ్చింది. ఎల్లా నిర్ణయించటమా? అని. ఆ కాండిడేట్సు కనుక పూర్వమే రిసెర్చి చేసి పేపర్లు అచ్చేసి ఉంటే అప్పుడు వాళ్ళకి కావలసిన శక్తి ఉన్నట్టే అని నిర్ణయించుకున్నారు.

అయితే నిరుద్యోగ సమస్య దండిగా ఉండటం చేత రిసెర్చి లాబుల్లో హెల్పర్ ఉద్యోగాలకి కూడా పేపర్లు అచ్చేసిన కాండిడేట్సు రావటం మొదలు పెట్టారు. వచ్చిన అందరు అభ్యర్థులకి పేపర్లుంటే నిర్ణయించటం ఎల్లా? అందుకని పేపర్ల సంఖ్యను బట్టి నిర్ణయం తీసుకోవాలనుకున్నారు. అది తెలిసిన తెలివైన ఘటాలు ఒక పేజి, అర్థ పేజి పేపర్లు వందల కొద్ది అచ్చేసి ఉద్యోగాలకి ధరఖాస్తు పెట్టడం మొదలుపెట్టారు, నువ్వు విశాఖపట్నంలో పూర్ణా మార్కెట్టులో దొండకాయలు వంద లెక్కల్లో బేరమాడితే ఏం చేస్తుంది ఆ అమ్మి? చిన్న చిన్నవన్నీ వేస్తుంది. ఇక్కడా అంతే. అందుకనేగా భారత ప్రభుత్వం అన్ని క్రయవిక్రయాలు తూకంలో చెయ్యాలని అంటున్నారు. కొన్ని షాపుల్లో లీటర్ల కొలిచి పోస్తున్నారంటే ప్రజల అమాయతక్వం, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణం అనుకో, అది వేరే విషయం. ప్రభుత్వం శాసనాలు చేస్తుంది. అది అమలు జరపకపోతే మన తప్పు. అది సరేలే, అందుకని గురు ప్రభుత్వోద్యోగుల శాఖకి గూడా ఓ త్రాసు వచ్చింది. అది చూసి కొంతమంది అది న్యాయదేవత త్రాసనుకున్నారు. ఇవన్నీ నాకెల్లా తెలుసు అంటావేమో. వెయిట్సు ఎండ్ మెషర్సు డిపార్టుమెంటులో నాకు స్నేహితులున్నారు. ఈ డిపార్టుమెంటు మినిష్టర్ల పాలిటి వరం. నిజాయితీగల అయ్యేయ స్సాఫీసర్లందర్ని మినిష్టర్ల కిబ్బందిగా తయారవుతున్నారు. అల్లాంటి వాళ్ళందర్ని ఎడ్మినిస్ట్రేషన్‌లో నుంచి తప్పించి ఈ డిపార్టుమెంటులో పారేస్తే సరి. హాయి!

ఇంతకు ఏం చెప్తున్నాను! అది న్యాయదేవత త్రాసని కదూ! నిజానికది అల్లాంటిదే.! అయితే ఇండియన్సు జీనియస్సులు, దేంట్లోనైనా లూప్ హోల్సు కనిపెట్టడంలో నిపుణులు. 'అంకెల బదులు బరువులు వాడకం వచ్చాక అందరు కిలోగ్రాముల కొద్ది పేపర్లు వ్రాయటం మొదలు పెట్టారు. ఎల్లాంటే, ఒకచోట అచ్చేసినిదాన్నే కొంచెం మార్చి మరో దాంట్లో అచ్చేసి, పైగా కొంచెం పెద్ద ప్రింటు, మొద్దు కాగితం ఉన్న జర్నల్సులో అచ్చేయడం మొదలుపెట్టారు. న్యాయదేవత త్రాసు దాంతో తప్పుగా తూగడం మొదలు పెట్టింది. ఇల్లాంటి రిపీటిడ్ పబ్లికేషన్సు ఇండియన్ జర్నల్సులోనే ఎక్కువగా జరుగుతున్నందువల్ల, ఇండియన్ జర్నల్సుతో పబ్లిష్ అయినా వాటి కెక్కువ విలువ నివ్వరాదని నిర్ణయించుకుంది ఆ శాఖ. అయితే ఇండియన్ జర్నల్సులో కొన్ని మంచివి లేకపోలేదు. అవి కూడా జగన్నాధ రథ చక్రాల కింద పడ్డాయి. పేపరు అచ్చయిన దేశం బట్టి విలువ లివ్వటానికిగాను ఆ మారకం రేటు తయారు చేసింది. అమెరికాలోనూ థర్డు రేటు జర్నల్సున్నాయి. వాటిల్లో పబ్లిష్ చేసినా లాభసాటిగా తయారైంది. కాని ఏ సూత్రాన్నైనా యూనిఫారమ్‌గా వాడితే అన్యాయం తక్కువ జరుగుతుందని

ఆ శాఖ నమ్మింది. ఆ శాఖ దాన్ని పుట్టించిన ప్రభుత్వంకంటే నయం, సెక్యులర్ స్టేటయిన మన దేశంలో రెలిజన్‌బట్టి లా వర్తిస్తుంది. ఇల్లా ఎన్నో చెప్పొచ్చు. మన నాన్ యూనిఫార్‌మిటీకి, అన్నట్టు పొద్దుపోయింది. రేపు పై కథ చెప్తాను' అని చుట్టం కబుర్లనుంచి లేచాడు.

## 7. పనికిరాని ఇండియన్ పిహెచ్.డి. కథ

మర్నాడు ఎదురు బాల్కనీలో చీర కట్టుకోకుండా ఉత్త జాకెట్టు పరికిణీలతో పచార్లు చేస్తున్న ప్రౌఢ సర్దారిణిని గోపాల్రావ్ తదేకంగా చూస్తుంటే, చుట్టం అక్కడికి వచ్చి, 'మొన్న నువ్వు చూసిన అబ్బాయికి మెడ మీద పుట్టుమచ్చ ఉంది కదూ?' అని అడిగాడు.

'అవును. అతడి కథ తెలుసుకున్నారా?' అంటూ ఆత్రంగా అడిగాడు గోపాల్రావ్. ఇతగాడికి రిసెర్చి మీద ఎంత ఆసక్తి అని ఆశ్చర్యపోయాడు చుట్టం. ఎందుకంటే ఇంతకు పూర్వం వాళ్ళింటికి వచ్చిన బ్రహ్మచారి కుర్రాళ్ళు ఇదే పని చేస్తుండగా వాళ్ళని చుట్టం తమాషాకి పలకరించి చూశాడు. వాళ్ళు చెక్కు చెదరలేదు. వాళ్ళ యోగ సమాధి చెడలేదు, అందుకని చుట్టానికి గోపాల్రావ్‌ని చూస్తే ముచ్చటేసి కథ చెప్పడం మొదలుపెట్టాడు.

'ఆ పుట్టుమచ్చున్న అబ్బాయిపేరు రామనాథం. వాళ్ళది తంజావూరు. అందుకని చాలా తెలివైనవాడు. అతను, తను ఫలానా విషయంలో రిసెర్చి చెయ్యాలని నిర్ణయించుకున్నాక, ఆ ఫీల్డులో అమెరికాలో, ఇంగ్లండులో రిసెర్చి చేస్తున్న పెద్ద తలకాయ లన్నింటికీ 'మీ పేపర్ల కాపీలు (రిప్రింట్సు) పంపండి' అని వ్రాసి సంపాదించి, అవి చదివి -

'నేను మీ పేపర్లు చదివాను. మీరు ఆ విషయంలో రిసెర్చి చెయ్యటానికి ఏం మిగిల్చినట్టు లేరు' అని ఉబ్బేస్తూ ఉత్తరాలు వ్రాశాడు. 'లేకేం ఉన్నాయి.' అని వాళ్ళు కొన్ని సూచించారు. అవన్నీ చేసేశాడు. అవి చేసి, 'నాకు రిజల్ట్సు ఇల్లా వస్తున్నాయి. అల్లా వస్తున్నాయి - మీ అభిప్రాయం ఏమిటంటూ ఉత్తరాలు వ్రాశాడు.

అయ్య బాబోయి, మనం గొప్పవాళ్ళ మన్నమాట. మనం అంటే ఆ అబ్బాయి కెంత గురి అన్న అభిప్రాయం వాళ్ళకి కలిగించి, ఆ పైన వాళ్ళు రెవ్యూయర్సుగా ఉన్న ఫారిన్ జర్నల్సుకి పేపర్లు పంపించాడు. అవన్నీ అచ్చుయ్యాయి. ఇల్లా ఓ పది పేపర్లు అచ్చేసి, థీసిస్ వ్రాసి వాళ్ళనే ఎగ్జామినర్సుగా చెయ్యమని తన గైడుతో చెప్పాడు. గైడుకి రామనాథంతో మొహమాటం ఉంది. ఎందుకంటే, తన పేపర్లన్నింటిమీద గైడు పేరు పెట్టాడు రామనాథం. అందుకని గైడు ప్రొఫెసరికి సిఫార్సు చేశాడు. ఆయనకి గైడుకి లావాదేవీలు ఉన్నాయి. రామనాథం చేత అన్ని పేపర్ల మీద ప్రొఫెసరు పేరు పెట్టించాడు, అతని గైడు. అందుకని ప్రొఫెసరు ఆ ఎగ్జామినర్సును ఒప్పుకుని ఆ పేర్లు డైరెక్టరుకు సూచించాడు. డైరెక్టరుకి ప్రొఫెసరంటే చాలా అభిమానం. ఎందుకంటే ఆయన వాళ్ళ డిపార్టుమెంటు నుంచి ఏ పేపరచ్చయినా దాని మీద డైరెక్టరు పేరు పెట్టిస్తాడు. అందుకని డైరెక్టరు గూడా ఒప్పుకున్నాడు. అంటే రామనాథం పేరుతో పాటు మరో మూడు పేర్లు కూడా అతని పేపర్ల మీద ఉండటానికి ఒప్పుకున్నందుకు, రామనాథం, థీసిస్ సబ్మిట్ చేసిన మూడు నెలల్లో, తన కనుకూలురైన

ఎగ్జామినర్సు ద్వారా డిగ్రీని సంపాదించాడు. ఇండియాలో పిహెచ్.డి చెయ్యాలంటే ఇటువంటి తెలివితేట లుండాలి మరి నీకున్నాయా?'

'లేవండి' అన్నాడు గోపాల్రావు.

'అయితే ఫారిన్ పోరాదూ?' అన్నాడు, సిద్దయ్య వరండాలో కదుగు పెడుతూ.

'నేను కథ పూర్తి చేసేసరికి అతనే ఆ నిర్ణయం తీసుకుంటాడు - గ్యారంటీ' అంటూచుట్టం కథ కొనసాగించాడు.

'రామనాథం ఎంత తెలివైన వాడైనా విధికి తల వంచక తప్పలేదు. డిగ్రీ తెచ్చుకోడానికి పనికొచ్చిన తెలివి తేటలు ఉద్యోగం రావటానికి ఉపకరించలేదు. గురుద్యోగ శాఖ వాళ్లు పేపర్ల మొత్తం బరువుని తూచి, దాన్ని మారకం రేటు సహాయంతో, ఈక్వివలెంటు ఇండియన్ బరువుగా మార్చి, పేపర్ల మీద నాలుగు పేర్లుండబట్టి, మొత్తం బరువుని నాలుగు పెట్టి భాగించారు. అందువల్ల రామనాథం తాలూకు పరిశోధనా భారం పేపర్ల రూపంలో 1.5 కిలో గ్రాములని తేల్చారు. అతని థీసిస్ బరువు 3 ఇండియన్ కిలో గ్రాములు. అందువల్ల గురు ప్రభుత్వోద్యోగుల ఎన్నిక శాఖ (గుప్రశా) లెక్కల్లో రామనాథం రిసెర్చి బరువు 4.5 కిలోలు. రామనాథం వెళ్ళిన ప్రతి ఇంటర్వ్యూకి కనీసం వో అమెరికన్ డాక్టరేటు వచ్చేవాడు. అతగాడి థీసిస్ కనీసం వో అర్థకిలో ఉండేది. అది అమెరికన్ థీసిస్ కదా. అందుకని ఇండియాలో దాని బరువు కనీసం 7.5 కిలోలు. అందుకని ఆ ఉద్యోగాన్ని అతగాడు గద్దలా తన్నుకు పోయేవాడు. (ఫారిన్ థీసిస్ ఫారిన్ జర్నల్స్‌లో పేపర్ల కంటే చాలా బరువు). మిఠాయి పొట్లం గద్ద తన్నుకు పోతే బిక్క మొహం వేసిన కుర్రాడిలా రామనాథం వెర్రి మొహం వేసేవాడు. కాని ఇంత చిన్న కారణానికి రామనాథం డిగ్రీ కాయితంతో సిగెరెట్టంటించుకోలేదు. ఆ ఉద్యోగం వచ్చిన వాళ్ళందరూ ఇంతో అంతో నిజంగా శక్తి మంతులు. కాని తన కంటే జూనియర్ మూఢేశ్వర్ పది రెట్లు గొప్పవాడని నిరూపింపబడి, అతగాడు గద్దలా ఉద్యోగం తన్నుకు పోయినప్పుడు మాత్రమే అతనికా డిగ్రీ మీద అంత అసహ్యం వేసింది.

జూ. మూఢేశ్వర్ గురించి మూడు ముక్కల్లో చెప్పటం కష్టం. అయినా ప్రయత్నిస్తాను. అతడిండియాలో నేర్చుకున్నది మూడు ముక్కలాట. అమెరికాలోనేర్చుకున్నది పోకర్. వాళ్ళ నాన్న మూఢేశ్వర్ సీనియర్ ఒక మినిష్టరు. అందుకని ఆ మినిస్ట్రీకి జూ. మూఢేశ్వర్ వారసుడు. ఇండియాలో వారసత్వపు హక్కులింకా పోలేదు. అతగాడు చదువుకున్నట్టూ, పెద్దపెద్ద ఉద్యోగాలు చేసినట్లూ చూపించి ఆపైన ఎలక్షన్లో నిలబెట్టి గెలిపించాలి అని వాళ్ళ నాన్న ప్లాన్. అందుకని వాళ్ళబ్బాయికి తను ప్రో ఛాన్సులర్‌గా ఉన్న యూనివర్సిటీలో గబగబా ఎమ్మెస్సి డిగ్రీ ఇప్పించాడు. వడ్డించేవాడు మనవాడు కదా అని ఫస్టు క్లాసు కూడా ఇప్పించాడు. దానికి నిజం చెప్పాలంటే జూ. మూఢేశ్వరే విధంగాను బాధ్యుడు కాదు.

ఎమ్మెస్సీ అవగానే అతడిని గురు ప్రభుత్వోద్యోగుల ఎన్నిక శాఖ వారి వ్యక్తి పరీక్షకు పంపాడు. 'మా అబ్బాయి కాళ్ళ వేళ్ళ దగ్గర నుంచి నెత్తి మీద వెంట్రుకల దాకా శక్తి సామార్థ్యాలుతోనే నిండి ఉన్నాడు, కనుక అతన్ని తూచండి' అని చెప్పి చూసాడు. సీ.

మూఢేశ్వర్. ఈ రకం పోటీలో జూ. ముఢేశ్వర్ చాలా మందిని వోడించగలడని వాళ్ళ నాన్న నమ్మకం. అయితే అదే ఉద్యోగం ఇంకో పెద్ద మంత్రిగారి బక్కపలుచటి అల్లుడికి వ్రాసిపెట్టింది కనుక ఇతగాడి సలహాను వాళ్ళు పాటించలేదు. పైగా బక్క పలుచటి అల్లుడు ఫారిన్ వెళ్లొచ్చాడు.

అందుకని పెద్ద మూఢేశ్వర్ తన పుత్రరత్నాన్ని కొలంబొ ప్లాన్‌లోనో, అమెరికా ప్రభుత్వం భారత ప్రభుత్వానికి ప్రజల కిమ్మని ఇచ్చిన స్కాలర్ షిప్పుల్లో ఒక దాంట్లోనో, అమెరికా పంపించి ఊరుకున్నాడు. ఈ సదుపాయాల్లో సామాన్య పౌరులనబడే అలగా జనం పై దేశాలకి వెళ్ళకుండా ప్రభుత్వం చాలా కటుదిట్టం చేసింది. అవి పెద్ద పెద్ద అధికారుల పిల్లలకి, వర్తకుల పిల్లలకి ఇస్తూ వారికి మనస్తాపం కలగకుండా జాగ్రత్త తీసుకుంటోంది.

అల్లా అమెరికాకి వెళ్ళిన జూ. ముఢేశ్వర్‌కి అక్కడేం చెయ్యాలో తెలియక పోకర్ నేర్చుకున్నాడు. అతన్నేంచెయ్యాలో తెలియని విశ్వవిద్యాలయాధికారులు అతన్ని బయటికి పంపించారు. అప్పుడు భారత రాయబార కార్యాలయం వారు డిప్లొ మాటిక్ ప్రెషర్ తీసుకు వచ్చి అతగాడికి వో మారుమూల యూనివర్సిటీలో ఎడ్మిషన్ సంపాదించారు. అక్కడ చిరంజీవి మూఢేశ్వర్‌కి గైడుగా ఉండటానికి ఒప్పుకున్నాడు చాల తెలివైన వాడు. అమెరికాలో ఉన్న కార్ల నంబరు - బోర్డుల సైజు మీద థీసిస్ వ్రాయమన్నాడు. జూ. మూ. మూడేళ్ళ పాటు రాత్రిళ్ళకి మాత్రమే పోకర్‌ని కేటాయించి కష్టపడి రిసెర్చి చేసి థీసిస్ సబ్మిట్ చేశాడు. అక్కడ ఎక్స్టర్నల్ ఎగ్జామినర్సుతో బెడద లేదు. గైడు ఒప్పుకుంటే డిగ్రీ వచ్చినట్టే. అందుకని చి. మూఢేశ్వర్‌కి డిగ్రీ, అతను తిరిగి స్వదేశం వెళ్ళిపోయే షరతుమీద. 'ఇల్లాంటి కాండిడేటు మా యూనివర్సిటీ చరిత్రలో లేడు.' అన్న టెస్టిమోనియల్‌తో ఇచ్చి ఇండియా తోలేశారు.

ఇండియా వచ్చి తను సంపాదించిన విజ్ఞానంతో దేస్సేవ చెయ్యాలని సంకల్పించి దానికి అనువుగా ఉండే పెద్దుద్యోగాలకి దరఖాస్తులు పడేశాడు. అందులో వో ఉద్యోగానికి రామనాథం ప్రత్యర్థిగా వచ్చాడు. యథావిధిగా తూకం జరిగింది. మనం ముందర చెప్పుకున్నట్టుగా రామనాథం శక్తి బరువు 4.5 ఇండియన్ కిలోలు. జూ. మూఢేశ్వర్ థీసిస్ అమెరికన్‌ది. అది 3 కిలోలు తూగింది. అంటే దానికి ఇండియన్ ఈక్వివలెంటు 45 కిలోలు. అందుకని జూ. మూఢేశ్వర్ రామనాథం కంటే పది రెట్లు శక్తి మంతుడని నిర్ణయించి, ఆ ఉద్యోగం అతనికిచ్చారు. జూ. మూఢేశ్వర్ వ్రాసిన చెత్త, పిహెచ్.డి. థీసిస్ ఎల్లా అయిందో, ఒకవేళ అల్లాంటిది పిహెచ్.డి.కి పనికి వచ్చినా, సైన్సులో పిహెచ్.డి ఇవ్వటానికి ఎల్లా పనికి వచ్చిందో, ఎంతాలోచించినా తెలియని రామనాథం జుట్టు పీక్కుని మతి స్తిమితం తప్పి తన ఇండియన్ డిగ్రీని తిట్టుకుని, కసి తీరక ఆ కాయితం పెట్టి సిగరెట్టు అంటించుకున్నాడు. నిన్న నువ్వు చూసిందదే. ఆ రోజే అతని రిజల్టు చెప్పారు. అంటే అంత వెంటనే చెప్పారా అని నోరు తెరవకు, జూ. మూఢేశ్వర్ త్వరగా దేస్సేవ చెయ్యగలందులకు అలస్యం లేకుండా చెప్పారు' అని ఆయన ముగించారు.

"'ఈ మూఢేశ్వర్.. వీడు.. మా యూనివర్సిటీకి వచ్చి దేశభక్తి ఉన్నవాళ్లెవరూ ఫారిన్

వెళ్ళరాదంటూ లెక్చర్లిచ్చి తన కొడుకును పంపించాడా? రాస్కెల్? డబుల్ స్టాండర్డ్సు' అంటూ గోపాల్రావు పళ్ళు కొరికాడు.

"'ఇందుకనా నాయనా! నువ్వింటియాలోనే, పిహెచ్.డి. చేస్తానని హడావిడి చేస్తా! మన బాగు వేరు. దేశం బాగువేరు. మనం మన బాగు చూసుకుని ఇతర్లు దేశం బాగు చేసుకునేటట్లు చేయ్యాలి' అని దేశానికి, 'మన'కి మధ్య సిద్దయ్య గీత గీశాడు. 'మన' వైపు నుంచి ఆ గీత దాటి 'దేశం' వైపు వెళ్ళనని గోపన్న మామయ్యకు ప్రమాణం చేశాడు. 'పిచ్చినాయన' అని ముద్దెట్టుకున్నాడు సిద్దయ్య.

## ఇదో మజిలీ

గోపన్న వాళ్ళ మావ సిద్దయ్యతో యూనివర్సిటీ యాత్రలు ముగించుకుని వాళ్లూరుచేరుకున్నాడు. అక్కడనుంచి అమెరికాలో ఉన్న యూనివర్సిటీల్లో పేరున్న వాటికి, లేని వాటికి అప్లికేషన్సు పడేశాడు. ఈ లోపల ఖాళీగా ఉండటం ఎందుకని 'బ్రెయిన్ డ్రెయిన్' మీద వ్యాసాలు వ్రాసి ఆంధ్ర పత్రికకు, కొన్ని ఇంగ్లీషు పత్రికలకు పంపాడు. అందులో కొన్ని అచ్చయ్యాయి. అవి చదివిన కొంత మంది ప్రొఫెసర్లు నవ్వుకోలేక చచ్చారు. 'బ్రెయిన్సుమి మనం. ఇండియాలో ఉంటే అవి డ్రెయినయి పోయాయంటాడేమిటీ కుర్రాడు, అసలు బ్రెయిన్సు బరువుకి డ్రెయిన్‌లో అడుక్కి దిగి ఆగిపోయాయి. చెత్తా చెదారం డ్రెయిన్సంబడి కొట్టుకు పోయింది' అని పరస్పరం వీపులు తట్టుకున్నారు. అందులో ప్రొ. ఛోర్, ప్రొ మేఘనాథ్ వాళ్ళనుకున్న విషయం సంపాదకునికి ఉత్తరాలలో వ్రాశారు. జా. మూఢేశ్వర్ మాత్రం 'నిజంగా దేశభక్తి, మరియు తెలివిగల భారతీయులు పై దేశాలకి వెళ్ళి వాళ్ళ రహస్యాలు క్షుణ్ణంగా తెలుసుకుని ఇండియా వచ్చి దేస్సేవ చేస్తారు' అంటూ వ్రాశాడు. అతడు అమెరికా నుంచి వచ్చాక ఇంటర్నేషనల్ హోటళ్ళలో దిగిన అమెరికన్సుతో పోకరాడి ఇండియాకి అమెరికన్ డబ్బు సంపాదించి దేస్సేవ చేస్తున్నాడు.

## 8. లాబ్ చరిత కథ

గోపాల్రావుకి అమెరికన్ యూనివర్సిటీస్ నుంచి ఎన్నాళ్ళకి జవాబు రాకపోతే ఆ ఖాళీ రోజుల్లో కవిత్వం వ్రాశాడు. దానిపేరు 'లాబ్ చరిత్ర'

ఏ లాబ్ చరిత్ర చూసినా
ఏమున్నది గర్వ కారణం
శాస్త్రజ్ఞుల చరిత్ర సమస్తం
పర దూషణ పరాయణత్వం
శాస్త్రజ్ఞుల చరిత్ర సమస్తం.
పరస్పరారోపణోద్యోగం
శాస్త్రజ్ఞుల చరిత్ర సమస్తం

విశేష ప్రచార పాడంబరం
బలవంతులు విజ్ఞుల జాతిని
బానిసలను కావించారు
పారసైటులు రిసెర్చి గైడులై
చరిత్రమును ప్రసిద్ధి కెక్కిరి,
చల్లారిన ఉత్సాహాలు
మరణించిన అంతరాత్మలు
జె.ఆర్.ఎఫ్.ల హా హా కారాలు
లాబుల్లో మూలుగుతున్నవి
టైపిస్టులు, మెకానిక్కులు
డైరెక్టర్లు, రిజిస్ట్రారులు
మినిష్టర్లు, అందరు కట్టిరి
రిసెర్చికి సజీవ సమాధి.
ప్రఖ్యాత విశ్వవిద్యాలయంలో
విద్యార్థుల జీవన మెట్టిది?
ప్రొఫెసరచ్చేసిన పేపరు కాదోయ్!
దాన్ని వ్రాసిన విద్యార్థెవడు?

శ్రీశ్రీని అనుకరిస్తూ అయిదు రోజులకి నాల్గు లైన్లు చొప్పున వ్రాస్తూ వచ్చేసరికి ఇరవై నాలుగోలైను పూర్తయిన రోజు గోపాల్రావుకి అమెరికన్ యూనివర్సిటీస్‌లో ఒక దాంట్లో ఫెలోషిప్ వచ్చింది.

గోపన్న పాసు పోర్టు, వీసాలు తీసుకొన్నాడు. ఆపైన గోపన్నకి సిద్దయ్య మణి నిచ్చి పెళ్ళిచేసి విమానం టిక్కెట్టు కొని పెట్టాడు. ప్రస్తుతం గోపన్నొకడే అమెరికా వెడుతున్నాడు.

## చివరి మజిలీ

సిద్దయ్య, గోపన్న, మణి రైల్లో మద్రాసు జేరుకున్నారు, కూడా ప్రయాణం చేసిన మద్రాసీలు "ఫలానా హోటల్లో దిగకండి. దాన్ని మొన్నే పోలీసులు రెయిడ్ చేశారు" అంటూ మాటసాయం, ఆపయిన రైలు దిగేటప్పుడు మూట సాయం చేశారు. గోపన్న, మణి తనతో ఉన్నారు కనుక గాని లాప్పోతే సిద్దయ్య ఆ హోటలుకే పోను. కాని ఈ సారికి మంచి పేరున్న ఖరీదైన హోటల్లోనే బస పెట్టాడు. ఆ రోజంతా మణి, గోపన్న చిలకా గోరికంల్లా చెట్టా పట్టాలేసుకుని మెరీనా బీచులు, చైనా బజార్లు తిరిగారు. సిద్దయ్య ఆ టైములో సినిమా తారల రేట్లు, పాండీ బజారులో వ్యాపారం గురించి వాకబు చేసి మరోసారి జాగ్రత్త పడ్డాడు.

ఆ మర్నాడు పెందరాళే గోపన్న కిడ్లీ దోసె చివరసారి పెట్టించి, కూతుర్ని, అల్లుడ్ని

తీసుకుని సిద్ధయ్య విమానాశ్రయంకి టాక్సీలో బయలు దేరాడు. మణి బెంగగా కన్నీళ్ళు పెట్టుకుంటుంటే పెట్టుకున్నన్నిసార్లు తన జేబు రుమాల్తో ఆ కన్నీళ్ళు ప్రేమతో తుడిచాడు గోపన్న. ఆ క్షణంలో అతని హృదయం బోల్డు భావోద్వేగంతో స్పందించింది. అల్లాటప్పుడు "నే నమెరికా వెళ్లగానే ఇల్లూ అదీ చూసుకుని, ఆ దేశానికి నే కొంచం అలవాటు పడగానే ఉత్తరం రాస్తాను. అదందగానే నెక్ట్సు ప్లేన్లో వచ్చేదు గాని! ఏం అమ్మా!" అని మణితోనూ, "మావయ్యా! మణి  క్కూడా పాస్‌పోర్టు తీసుకుని రెడీగా ఉంచు, అన్నీ ఏర్పాటవగానే ఉత్తరం రాస్తాను. మణిని పంపించు" అని సిద్ధయ్యతోనూ అంటూ వచ్చాడు.

విమానాశ్రయానికి జేరటంతోనే గోపన్న వెళ్ళి తను వచ్చినట్టు రిపోర్టు చేసుకున్నాడు. ఇంతలో ఇద్దరు కాకీ బట్టలబ్బాయిలు వచ్చి ముందర ఇంగ్లీషులోను, గోపన్న తెలుగువాడని పోల్చుకున్నాక తెలుగులోను నమస్కారాలు పెట్టారు. గోపన్న తన పలుకుబడికి ఆశ్చర్యపోయాడు. "మీ సామాన్లు మేం ప్లేన్లో ఎక్కిస్తాం సార్. మీకేం భయంలేదు సార్!" అని అతని చేతుల్లో సామాన్లు లాక్కుని వాటికి చీట్లు కట్టి, ఆ చీట్ల తాలూకు ముక్కలు గోపన్న చేతిలో పెట్టి నవ్వుతూ నిలబడ్డారు. గోపన్న బావుండ్దని ఓ నవ్వు తిరిగి నవ్వాడు. వాళ్ళు మళ్ళీ నవ్వారు, ఈ సారి కూడా నవ్వితే మరీ వెకిలిగా ఉంటుందని తోచి గోపన్న నవ్వలేదు. అప్పుడు వాళ్ళింక లాభంలేదని గ్రహించి "మీకు సార్.... మాకు సార్.. కాఫీకి సార్" అంటూ నవ్వు నసుగుడు కలపి చేతులు జాచారు. తెలుగువాడు అంటేనే డబ్బు విషయంలో ముందూ వెనుక చూడని వాడని అర్థం కనుక గోపన్న ఇద్దరికి చెరో పది రూపాయలు ఇచ్చేసి పంపించాడు. అప్పుడు ఎయిర్‌లైన్సు వాళ్ళు చెప్పారు-విమానం ఓ రెండుగంటలాలస్యంగా మద్రాసొదుల్తుందని,.మణితో మరో రెండు గంటలు హెచ్చుగా గడపగలందులకి గోపన్న, అతని కళ్ళల్లో తన బొమ్మ చూస్తూ మరి కొంచెంసేపు కూర్చోగలందులకు మణి సంతోషించారు.

సిద్ధయ్య ఎయిర్ హోస్టెస్సులు తీరిక సమయాల్లో వంట చెయ్యటం, నవలలు చదవటం కాకుండా ఏం జేస్తూ ఉంటారో వాకబు చేయటానికి దూరంగా ళ్ళాడు.

మావయ్య కనుచాటగానే గోపన్న సిగరెట్లు కొనుక్కోడానికి వెళ్ళాడు. అతనింకా అమెరికా వెళ్ళలేదు కనుక పెద్దవాళ్ళ ముందర సిగరెట్లు కాల్చే అలవాటు కాలేదు. సిగరెట్లమ్మే షాపు దగ్గర ఓ ఆరడుగుల ఆజానుబహుడు కనిపించి "ఎందాక?" అంటూ పలకరించాడు. "అమెరికా" అని గోపన్న జవాబు చెప్తుండగానే, "ఎందుకు?" అంటూ అడిగాడు ఆ ఆరడుగుల పెద్ద మనిషి. "పిహెచ్.డి. చెయ్యటానికి" అని సవినయంగా సమాధానం చెప్పాడు గోపన్న. "అద్దేశాకా...?" అంటూ మరో ప్రశ్న వేశాడు పెద్ద మనిషి. "తిరిగి మన్దేశం వచ్చేస్తా" అన్నాడు గోపన్న. ఆ పెద్దమనిషి ప్రతాపరుద్రీయంలో పిచ్చివాడిలా ఉరుముతూ నవ్వాడు. అతని పిచ్చివాలకం జూసి గోపన్న భయపడి మరో మాటనకుండా, మరో క్షణం అలస్యం చెయ్యకుండా - ఆ పెద్ద మనిషితో మాట్లాడినప్పటికంటే మణితో మాట్లాడినప్పుడే బావుందని గుర్తించి - త్వరగా మణిని జేరుకున్నాడు.

సిద్ధయ్య మావ వాకబులు పూర్తి చేసుకుని రాగానే గోపన్న, "ఇందాకేమో మావయ్య!

పిప్పరమెంట్లు కొందామని కొట్టుకెళ్తే అక్కడో అరడుగుల తెలుగాయన కన్పించాడు. అయన్తో మాటల్లోనే నమెరికా వెళ్తున్నానని, పిహెచ్.డి చెయ్యబోతున్నానని చెప్పాను. దానికాయన ఏమి అన్లేదు కాని, నేను పిహెచ్.డి చేసి ఇండియా వచ్చి దేస్సేవ చేస్తా ననగానే ఉత్త పిచ్చాయనలా నవ్వాడు. ఎవరికయినా ఉన్నట్టుండి పిచ్చిగాని ఎక్కుతుందా?'' అని, గబగబా తను చూసిన విశేషం చెప్పి, దాని గురించి కుతూహలం కనబర్చాడు. సిద్దయ్య కండువా పైనేసుకుని ఆరడుగుల పెద్దమనషి కేసి బయల్దేరాడు. కథ తెల్సుకోడానికి పోతూ బోతూ సిద్దయ్య "ఇదంతా నీకోసమే సుమా!" అన్నట్లు మణికేసి చూశాడు.

సిద్దయ్యాపెద్దమనిషిని, ''ఎందుకల్లా నవ్వి మా అల్లుణ్ణి బెదరగొట్టారు?' అంటూ నిల్దీశాడు. "మీవాడు పిహెచ్.డి చేసి ఇండియాకి తిరిగొస్తాడంటే నవ్వొచ్చిదంతే. ఉద్యోగం వెతుక్కోకుండా ఉత్త పూలాఫీసరర్గా వచ్చినవాడుత్త పూలాపీసరు. ఆ విషయమే చెబుదామనుకుంటూంటే ఆ కుర్రాడు భయపడ్డట్టున్నాడు. వెళ్ళి పోయాడు. అయినా అంత భయస్థుడికి పిల్ల నెలా ఇచ్చారండి.'' అని అడిగాడాయన, సిద్దయ్య మాటకి జవాబివ్వలేదు. భయస్థుడు కనకే ఆయన పిల్లనిచ్చేడు. అల్లుడనే వాడు భయస్థుడుగా ఉంటే (పెంకి ఘటం కాకుండా) ఏమావ సంతోషించడు! అదే కొడుకు విషయంలో అయితే దుఃఖించడు! సిద్దయ్య అడగబడిన ప్రశ్నకి జవాబివ్వక తనకి రాజకీయ పార్టీల్లో ఉన్న పలుకుబడి, ప్రభుత్వాన్ని చీటికి మాటి ఇబ్బంది పెట్టే ప్రతిపక్షనాయకులతో ఉన్న స్నేహాలు, ఆ మధ్య శాస్త్రజ్ఞులు ఇండియాలో జేసుకున్న ఆత్మహత్యల వైనాలు అన్నీ చెప్పి, మాటల్లో మాటలుగా ఆ పెద్దమనిషి భోగట్టా అంతా తెలుసుకుని, ఈ సారి ఇండియా వస్తే తనకి తెలియజేయమని తనెడ్రసిచ్చి కూతురు, అల్లుడు కూర్చున్న చోటికి పోయి విచారం నటిస్తూ కూర్చున్నాడు. గోపన్న "ఎందుకు నవ్వాట్ట మరీ విలన్లాగా?'' అని కోపంగా అడిగాడు. "అదో పెద్ద విషాద గాథ'' అంటూ సిద్దయ్య కథ మొదలు పెట్టాడు.

## 9. డాక్టరు పుల్లాయి ఇండియా వచ్చి వెళ్తున్న కథ

"పిచ్చి పుల్లయ్య వేమారం వెళ్ళొస్తే అది నవ్వొచ్చే కథ. అదే డాక్టరు పుల్లాయి ఇండియా వచ్చి పిచ్చెక్కి వెళ్ళి పోతూంటే అది విషాదగాథ'' అంటూ ప్రారభించాడు సిద్దయ్య.

"నువ్వు మరీ ఈ మధ్య కథలకి సబెడిటర్లు రాసే పరిచయవాక్యాలు చదువుతున్నట్టున్నావ్. అవుంటే అసలు కథ అర్థం కాదు. టైమంతా వాటికి, కథకి ఉన్న సంబంధం వెతకడంతో సరిపోతుంది., సైంటిఫిక్ పేపర్లతో సినాప్సిస్లకి మెయిన్ టెక్స్టులకి సంబంధం లేకుండా ఉండవు. ఇది సైంటిఫిక్ మెటీరియల్ కనుక ఆ పద్ధతిలోనే నువ్వు చెప్పాలి.'' అన్నాడు గోపన్న.

"మంచోడివే! మీ సైంటిఫిక్కోళ్ళు ఎంత అర్థం గాకుండా పేపర్లు రాస్తే అంత సులభంగా అవి అచ్చవుతాయని చెప్పారే అందిరూనూ! పోతే చెత్త చెదారం తీసేసి చెప్తే చెప్పేందుకేంటుంది? అందుకని నువ్వు రే మెరికా వెళ్ళాక పిచ్చి పిచ్చి ఊహాలు పెట్టుకోక. అక్కడ చెత్త చెదారం

బంగారంలా కనిపించేందుకు పై పూతల్దొరుకుతాయట, నువ్వూ అవే కొని పేపర్లు రాసే టప్పుడు వాడు, అద్సర్లే!

ఇంతకి ఉత్త పుల్లయ్యగా అమెరికా వెళ్ళి ఆ పెద్దమనిషి డాక్టరు పుల్లాయి అయ్యాడు. ఇండియా వచ్చాక డాక్టరు పుల్లాయి డాక్టరు పిచ్చి పుల్లయ్య అయ్యాడు. అదెల్లా జరిగిందంటే...

మన ప్రభుత్వం విదేశాల్లో ఉన్న శాస్త్రజ్ఞుల్ని ఇండియాకేసి అకర్షించేందుకు ఓ పథకమేసింది. దాంట్లో ఇండియా వచ్చి తెలివి తక్కువ వాళ్ళని పూలాఫీసర్లంటారు. వాళ్ళు ఏదో ఒక యూనివర్శిటీనిగాని, రిసెర్చి లాబ్‌నుగాని అద్దె కొంపలా పెంచుకుని అక్కడ్జేరితే వాళ్ళకి ప్రభుత్వం నెలకింతని ఇచ్చి ఉద్యోగం వెతుక్కోమంటుంది. వీళ్ళకి ఉద్యోగాలు రాకపోతే పరవాలేదుగాని వచ్చి వీళ్ళు వెళ్ళకపోవడం ముచ్చెం మూడుసార్లు జరిగితే ప్రభుత్వం నెల నెలా వేసే ముష్టి వెయ్యదు. ఇండియా ప్రభుత్వానికి నోబెల్ ప్రైజొచ్చిన ఖొరానాలేగాని సామాన్యులు కనబడరనే దాంట్లో నిజం లేదు. అయితే నిజమేమిటంటే పూలాఫీసర్లుగా వచ్చిన వాళ్ళల్లో కొన్ని కులాలకి చెందిన వారిగానో, రాజకీయ నాయికుల చుట్టాలగానో కొందరికి ఉద్యోగా లొస్తాయి కాని అందరికీ రావు. వచ్చేవాళ్ళు పూలాఫీసర్లుగా రాకపోయినా ఉద్యోగాలొస్తాయి. అందుకని అమెరికా వెళ్ళినోడూ కాటి కెళ్ళినోడూ ఒకటే! ఎక్కడో, ఎవడో, అక్కడుండే ఇక్కడద్యోగం చూసుకుని రాగలిగిన తెలివైన వాడి మాటొదిలేస్తే, ఇదే మామూలు పుల్లయ్య ఇదంతా స్వానుభవం మీద తెల్సుకున్నాడు. అదెల్లా అంటే...

"మావయ్యా సైంటిఫిక్కు కథలు టూకీగా చెప్పాలి" గోపన్న అడ్డుపడ్డాడు.

"పోరా! నువ్వు మరీను. ఒక పేపరు రాయటానికున్న మెటీరియల్తో వ్యాస్ ఏడు పేపర్లచ్చేయగా లేంది, నేను ఉన్న మెటీరియల్తో ఏడు కథలు గాకుండా ఒక్కటంటే ఒకటే చెప్పేటప్పుడు కాస్త వివరంగా చెప్పొద్దూ? ఇంతకూ డాక్టరు పుల్లాయికి ఈ పథకంలో ఇండియా వెళ్ళి రొండ్జేతులూ దేస్సేవ చేద్దామనీ అత్యాశ కల్గింది. అంజేత, "మీ యూనివర్శిటీలో ఉంటూ ఉద్యోగం వెతుక్కుంటానంటూ "ఏ అయిదారు యూనివర్సిటీలకో ఉత్తరం రాశాడు. అయితే వాళ్ళతని అప్లికేషను మీద 'డాక్టరు పుల్లయ్య చెయ్యడాని కిష్టపడే రిసెర్చి చేసుకోడానికి కావల్సిన సామగ్రి మా దగ్గరుంది! అది సదరు పుల్లయ్య కివ్వడానికి మే మిష్ట పడుతున్నాం' అంటూ ప్రభుత్వానికి రాయల్సి రావటంతో కేవలం ఒకే ఒక యూనివర్సిటీ వాళ్ళు మాత్రమే ఆ సాహసాని కొడిగట్టారు. అంజేత డాక్టరు పుల్లాయి అక్కడికే వెళ్ళి, ఇండియా వచ్చేసిన శుభ సమయంలో డాక్టరు పుల్లయ్య కింద మారాడు. అతన్ది ఇంజనీరింగు మెకానిక్సులో పియెచ్డిడీ. కారు మెకానిక్కులు, రేడియో మెకానిక్కులు నాకు తెల్సును గాని ఈ ఇంజనీరు మెకానిక్కుల సంగతి నాకు తెలియదు." సిద్దయ్య తన అజ్ఞానాన్ని ఎవరూ లేకుండా చూసి తన అల్లుడి దగ్గర బయటపెట్టాడు.

"అమెరికాలో ప్రతిదానికీ కొత్త పేర్లు వస్తున్నాయిలే? ఇదీ అందులో ఒకటి. మెకానిక్సు అంటే కదలని వాటి గురించి, కదిలే వాటి గురించి లెక్కలు కట్టే శాస్త్రం. ఆ శాస్త్రంవేరు. నువ్వు చెప్పే మెషీన్ల మెకానిక్కులు వేరు" అని గోపన్న తనకి తెలిసింది చెప్పాడు.

"డాక్టరు పుల్లయ్య ఆ యూనివర్సిటీలో జేరగానే ఉదయించిన మొదటి ప్రశ్న అతడు సాలీడు మెకానిక్కుల్లో....' అని సిద్దయ్య అంటుంటే గోపన్న, "సాలీడు మెకానిక్సు కాదు! సాలిడ్ అంటే ఘన పదార్థలతో తిప్పలు పడ్డం అన్నమాట. రెండోది ఫ్లూయిడ్ మెకానిక్సు అంటే ప్రవహించే పదార్థాల శాస్త్రం అన్న మాట" అంటూ సరి దిద్దాడు.

"గోపన్నా! అవన్నీ నా నోర్దిరగవుగాని నేను వాటిని ఒకటో మెకానిక్కు, రెండో మెకానిక్కు అంటాను. ఇంతకూ ఈ రెండు మెకానిక్కులు డాక్టరు పుల్లయ్య విషయంలో పూర్వం మిథిలలో నాగేటి చాలులో దొరికిన మణులు 'నీవంటే నీ"వని రైతులు పోట్లాడుకుని జనకుడి దగ్గర కెళ్ళినంత ధర్మంగాను అతగాడు 'మీ వాడంటే మీవాడని' ఘోరంగా పోట్లాడుకుని ఆ డిపార్టుమెంటు తలకాయ దగ్గరకెళ్ళి 'మా బిల్డింగ్‌లో చోటు లేదంటే మా బిల్డింగ్‌లో చోటు లేదని' గోడు వెళ్ళ బోసుకున్నారు. తలకాయకి తలనొప్పొచ్చింది. ఇలాంటి విషయాల్లో తలకాయలకి నొప్పి రాకపోతే కిరీటం వస్తుందా! అయనకి సరిదిద్దాల్సిన వ్యవహారాలు చాలా ఉన్నాయి. అందులో ముఖ్యమయినది వాళ్ళాఫీసులో టైపు చేసే చిన్నది, అఫీసు కాగితాలు చూసే చిన్నవాడు, 'మాకు రెండు కుర్చీలు అక్కర్లేదూ, చిన్న మొత్తాల పొదుపు చేస్తాం' అంటూ ఒకటంటే ఒకటే కుర్చీలో కూర్చుంటామని ముచ్చట పడుతున్నారు. ఇది నచ్చని వాళ్ళీ విషయం తలకాయ దగ్గర రిపోర్టు చేశారు. అయితే టైపుల చిన్నది, తలకాయ కూతురికీ అల్లుడికీ రాసే ఉత్తరాలు డిక్టేషను తీసుకుని టైపు చేసిపెడితే కాయితాల చిన్నవాడు, 'ఆఫీసు స్టాంపు లంటించి పోస్టు చేస్తూ ఉంటాడు. అందుకని ఇద్దరి మీద ఈగ వాలనిస్తే తలకాయకే ప్రమాదం. ఇవన్నీ ఆలోచించి తలకాయ డాక్టరు పుల్లయ్యకో కుర్చీ టేబిలు ఈ ప్రేమ పక్షుల మధ్యగా వేయించాడు. దాంతో పానకంలో పుడకలాటి పుల్లయ్యంటే వాళ్ళకి అసహ్యం ఏర్పడింది. అమ్మడు అతని కాగితాలు టైపు చెయ్యదు. దేవదాసతని కాగితాలు చూడడు. పుల్లయ్యకి వళ్లు మండి పోయింది. అసలే అతను అమెరికాలో చాకుల్లాంటి ఆడ సెక్రటరీల చేత పని చేయించుకున్నవాడు. అన్నట్టు గోపన్నా! ఆ ఆడ సెక్రటరీ లాట్టే మంచోళ్ళు కారుట. వాళ్ళ జోలికి పోకు " అంటూ సిద్దయ్య మణికేసి 'నీకేం భయం లే'దన్నట్టు చూశాడు. మణి గోపన్నకేసి చూసింది. గోపన్న 'అంతే మరి' అన్నట్టు చూశాడు. సిద్దయ్య మళ్ళీ కథందుకున్నాడు.

'డాక్టరు పుల్లయ్యకి వళ్ళు మండి ఈ విషయం తలకాయ చెవినేశాడు. ఆయన తలాడించి ఆ రోజుల్లో ఫేషను ప్రకారం "పాక్లామ్" అన్నాడు. ఆ పైన సర్దుకుపోడంలో గల ఆరు లాభాల గురించి డాక్టరు పుల్లయ్యకి తలకాయ తలకెక్కేలా బోధించాడు అయితే ఈ సర్దుకుపోడం అనేది అంతటితో ఆగలేదు. లాబ్‌లో ఉన్న గేజులు అవీ అందరు సర్దుకోవాలని, అయితే అవసరాలనుబట్టి ఎవరు ముందో ఎవరు వెనుకో ఏర్పాటు చేసుకోవాలని తలకాయ సూచించాడు. ఆ పైన డిగ్రీలకి ప్రిపేర్ సే స్టూడెంట్లు అంటే తన స్టూడెంట్లు అందర్లోకి ముందర అని వాళ్ళు వాడుకోగా మిగిలిన టైములో మిగతా స్టూడెంట్లు, వాళ్ళు కూడా వాడుకోగా ఇంకా ఖాళీగా ఉంటే పర్మనెంటు స్టాఫ్, ఆ పైన టెంపొరరీ స్టాఫ్ వాడుకోవచ్చని, పూలాఫీసరనే వాడు

అతిథి అని, అల్లాంటి వాడిచేత పని చేయించుకోటం పాపం అని అందుకని చిట్టచివరగా ఏవరికీ అక్కర్లేని సందర్భాలలో ఆ పరికరాలు ఇతగాడు వాడుకోవచ్చుననే ప్రయారిటీ లేర్పరిచాడు.

పుల్లయ్యకి తల్దిరిగింది. అందుకని జోరుగా ఉద్యోగాలకు అప్లై జేయటం మొదలు పెట్టాడు. వాళ్ళందరూ ప్రభుత్వానికి భయపడి ఇంటర్వ్యూలకి పిల్చేవారు. ఇతను తన కుద్యోగం ఇవ్వటానికి వాళ్ళంతా కాసుక్కూర్చునట్లు భ్రమపడి తనకైన అనుభవంతో, "నేను మీ సంస్థలో జేరితే మీరు నాకిచ్చు వసతులేమిటి?" అని ఎదురు ప్రశ్నించేసరికి 'ఈ పిచ్చాడెవరా' అని కాస్సేపాశ్చర్యపోయి ఆ పైన నవ్వేసేవారు. మొదట్లో అతనికొచ్చిన ఓటి రెండు ఉద్యోగాలు తనకి తగవని వదిలేశాడు. అతనికి నిజమైన రిసెర్చి చెయ్యడానికి శక్తుందని - అది లేని వాళ్లతో కల్సి పనిచేయడానికి అర్హుడు కాదని కొందరు, తెలుగు వాడని మరికొందరు ఉద్యోగం ఇవ్వలేదు. ఇంకా కొందరు, ఇతను మనల్ని బతిమాలుకోడం పోయి నా కేం వసతు చేర్పరుస్తా రంటూ ఇప్పుడే డబాయిస్తున్నాడు, రేపు కాల్చుకు తినవచ్చు. ఇతను మన కొద్దనుకున్నారు. అతను వెళ్ళిన చాలా ఇంటర్వ్యూలకి రైలు ఖర్చులు తనే పెట్టుకోవలసి వచ్చిందని, ముఖ్యంగా యూనివర్సిటీ ఉద్యోగాలకి ఎల్లాగూ మనం కాన్డిడేట్సును ఏరుకోవలసిన కొంచెం ఆ భాగాన్నివ్వటం లేదు కదా అని వాళ్ళు అప్లై చేసి వాళ్ళందర్నీ పిల్చేవారని చెప్పాడు. పియెచ్చిడీలు అవీ ఉన్నవాళ్ళని పిలవటం లాంఛనమని అతని అభిప్రాయం. వాళ్ళ దృష్టిలో అప్పుడే ఓ సెకండు క్లాసు ఎమ్మెస్సీ అతను మంత్రిగారికి కావలసినతనున్నాడని చాలా సార్లు డాక్టరు పుల్లయ్య విన్నాడు. ఓసారి డాక్టరు పుల్లయ్య తన వంతు కోసం కాచు క్కూర్చునుండగా కమిటీ ఛైర్మనుగారి భార్య సిన్మాకెళ్దాం రండంటూ కబురు పెట్టడంతో ఛైర్మను మిగిలినవి మర్నాటికి వాయిదా వేసి లేచి పోయాడు. ఇవన్నీ చూసి డాక్టరు పుల్లయ్యకి మతి చెడినంత పనైంది. కాని మతి చెడటం జరగలేదు. అది తరువాత జరిగింది.

ఉన్నట్టుండి డాక్టరు పుల్లయ్యకి వసతి కల్పించినట్లు నటిస్తున్న యూనివర్సిటీలో పరీక్షలొచ్చాయి. అక్కడ పరీక్ష పేపర్లు దిద్దితే డబ్బియ్యరు. అక్కడి వాళ్ళే పేపర్లు ఇచ్చి వాళ్ళే దిద్దే అలవాటు. ఒకటో మెకానిక్కులకీ, రెండో మెకానిక్కులకీ డాక్టరు పుల్లయ్య మీద ప్రేమ పెరిగిపోయి ఇతను మావాడంటే మా వాడని ముద్దెట్టుకుని చెరో వంద పేపర్లు అతని నెత్తిన పడేశారు దిద్దమని. డాక్టరు పుల్లయ్యకి కోపం వచ్చి తలకాయ దగ్గరకెళ్ళి ఫిర్యాదు చేశాడు. ఆయన డాక్టరు పుల్లయ్యకి తన కోపమే తన శత్రువని బోధచేశాడు. ఆ పైన ఆ డిపార్టుమెంటు వాళ్ళతో అతను కలిసి మెలసి ఉండాలని, దెబ్బలాడరాదని, పైగా డిపార్టుమెంటు తనదన్న భావం అతనికి కల్గాలని, ఆ డిపార్టుమెంటులో పని చేయటానికి అతనంతటతను ముందుకొచ్చుంటే బావుండేదని చీవాట్లేశాడు. డాక్టరు పుల్లయ్య ససేమిరా అన్నాడు.

కొంతకాలం జరిగాక, ఇండియా వచ్చి పుల్లయ్య చేసిన రిసెర్చి సున్న అనే విషయం ఆ డిపార్టుమెంటులో బాహాటంగా అనుకోవటం మొదలెట్టారు. అందుకని అతని పురోభివృద్ధి మీద తలకాయ రిపోర్టు కావాల్సొచ్చినపుడు, "డాక్టరు పుల్లయ్య మా డిపార్టుమెంటులో ఒకడిగా బాధ్యతలు స్వీకరించలేదు. అల్లా అని ఉన్నంతలో రిసెర్చి చేశాడా అంటే అదీ లేదు."

అంటూ సెర్మోహమాటంగా రిపోర్టు రాశాడు. అదైతెలిసినప్పుడు డాక్టరు పుల్లయ్యకి మతి పోయింది. దాంతో నెల నెలా వచ్చే డబ్బులు ప్రభుత్వం దగ్గర నుంచి రావటం మానేశాయి.

కాస్త మతి స్థిమితం చిక్కాక డాక్టరు పుల్లయ్య అనే బ్రెయిన్ అమెరికాకి డ్రెయిన్ అవటానికి నిశ్చయించుకుంది. ఆ నిశ్చయం రూపమే ఇప్పుడు నువ్వు చూస్తున్నది" అంటూ సిద్దయ్య కథ ముగించాడు, ఆ కథ విని గోపన్న దిగులు పడ్డాడు. గోపన్నని చూసి మణీ దిగులు పడింది. అద్జూపి సిద్దయ్య "నీకేం భయం లేదురా గోపన్నా! నీకు పియెచ్చిడీ వస్తోందనగానే ఇక్కడ ఉద్యోగం వేయిస్తా"నని హామీ ఇచ్చాడు. అది విని గోపన్న నవ్వాడు. ఆ నవ్వు చూసి మణి ఆనందించింది. మణిని చూసి సిద్దయ్య పొంగిపోయాడు!

ఇవన్నీ అయ్యేసరికి అమెరికా వెళ్ళే విమానం వచ్చింది. అందులో గోపాల్రావ్ పుల్లయ్య ఎక్కి కూర్చున్నారు.

## ఉపసంహారం

నా రచన "బ్రెయిన్ డ్రెయిన్" చదివిన పాఠకులలో ఇద్దరో ముగ్గురో మాత్రమే పత్రికాముఖంగా ఉత్తరాలు రాసినా, చాలా మంది వ్యక్తిగతంగాను, ఉత్తరాలు ద్వారాను వారి భావాలను తెలియజేశారు. అందులో విద్యార్థులు, నిర్దేశికులు (గైడ్లు) కూడా ఉన్నారు. దరిదాపుగా వీరందరు కూడా వారి పేర్లచ్చుయి పెద్దవాళ్ళ దృష్టిలోకి వెళ్ళటం ఇష్టంలేనివాళ్ళే.

నాకు ముప్పై సంవత్సరాలుగా దేశంలో జరుగుచున్న రీసెర్చితో పరిచయం ఉంది. పోతే నేను విద్యార్థిదశ గడచాకే నిర్దేశకుడిగా ఉన్నాను. అందుచేత ఉభయ పక్షాలవారి ఉద్దేశాలు తెలుసుకోడానికి అవకాశం కలిగింది. అయితే నా రచనలో బాధ్యతాయుతులైన రీసెర్చి స్కాలర్స్, స్వార్థపరులైన నిర్దేశికుల గురించి మాత్రమే రాశారు. అందుచేత నేను నాణానికి రెండో పైపు కూడా చూపించి ఉండాల్సిందని సాటి నిర్దేశికులు చివాట్లు వేశారు.

అమెరికాకు ఇమిగ్రేట్ అయినవారిని చూస్తే అందులో 80 శాతం విద్యార్థులుగా దేశం వదిలినవాళ్ళే. ఇక్కడ రిసెర్చికి సరియైన అవకాశాలు లేకపోవడంచేత, అధికారులకి విదేశీ డిగ్రీల మీద మోజు తగ్గకపోవడంచేత ఎక్కువ మంది పై దేశాలకి వెళ్తున్నారు. వాళ్ళ కారణాల్లో అక్కడి ఉద్రేకపూరితమైన వాతావరణం, అక్కడి నుంచి కుటుంబానికి ఎక్కువ డబ్బు పంపడానికి వీలవడం మొదలైనవి ఉన్నా, దేశంలో పలుకుబడిగల సగటు వ్యక్తులు పెద్ద పదవు లలంకరించటం, శక్తిమంతుల నిస్సహాయత, నిస్పృహ, అన్నింటికంటె ముఖ్యంగా తమతో అవసరం ఉన్నట్టు దేశం ప్రవర్తించకపోడం, నిజమైన పని చెయ్యటాని కవకాశం లేకపోవడం ముఖ్యం.

డ్రెయినయే వాటిల్లో ఎక్కువగా విద్యార్థులు బ్రెయిన్లుండటం చేత వారి ఇబ్బందుల గురించి మాత్రమే రాశాను. వారికి దేశం కల్పించలేకపోతున్న సరైన వాతావరణం గురించి రాశాను. నేను అతిశయోక్తులు వాడానని ఉపోద్ఘాతంలో చెప్పుకున్నది, చెప్పిన విధానంలోనే కాని చెప్పిన విషయంలో కాదని మనవి చేస్తున్నాను.

ఉదాహరణకి నెల నెలా స్కాలర్ షిప్పులు రాక రీసెర్చి స్కాలర్సిబ్బంది పడటం అప్పులు ముష్టెత్తడం సర్వసాధారణం. కాని కిళ్ళీ బడ్డీ దగ్గర ముష్టెత్తడం అతిశయోక్తి. కొత్తగా చేరిన విద్యార్థులని తమ గొడుగులోని తీసుకోవాసె పబ్లిష్ ఆర్ పెరిష్ సూత్రం వర్తించే సంస్థల్లో గైడ్లు తాపత్రయం పడటం సర్వసాధారణం. (అధికారంలో ఉన్నవారికి చాలా ఎక్కువమంది, చిన్నవాళ్ళకి అతి కొద్దిమంది స్టూడెంట్సుండటం సాధారణం). అయితే ఆడపిల్లల ద్వారా ప్రచారం చేయించటం అతిశయోక్తి. రెండు మూడు పాత పేపర్లలోని విషయాలు కలిసి కొత్త పేపర్లు వ్రాయటం 'పేపరు మిల్లు' తిప్పేవారి ఆచారం. ట్రేసింగ్ షీటు పద్ధతి అతిశయోక్తి. ఫారిన్ జర్నల్సులో పడ్డ పేపర్ల కెక్కువ విలువనివ్వటం నిజం. మారకం రేటు అతిశయోక్తి.

అయితే రీసెర్చి స్కాలర్సంతా మంచివాళ్ళు అని, నిర్దేశకులంతా చెడ్డవాళ్ళు అని నేను మాత్రం ఎలా అంటాను? వెళ్ళిపోతున్న వాళ్ళ కారణాలు రాశాను. అంతే! ఇంకా దేశంలో శక్తున్న నిర్దేశకులు, రీసెర్చి స్కాలర్సు మిగిలున్నారు కనుకనే దేశంలో రీసెర్చి యింకా సాగుతోంది. అయితే శక్తున్న నిర్దేశకులకి ఉత్సాహం ఉన్న రీసెర్చి స్కాలర్స్‌కాక వారి వంతుకి 'రీసెర్చిని స్టాప్‌గాప్'గా వాడుకునే విద్యార్థులు రావటం 'వారికి చెంచాలతో తినిపించాల్సి రావటం' కూడా అప్పుడప్పుడు జరిగి నిర్దేశకుల దృష్టి కూడా విదేశాలవైపు తిరిగేలా చేస్తోంది. నిర్దేశకుడెంత తక్కువ సహాయం చేస్తే రిసెర్చి స్కాలర్స్ అంతగా స్వంత కాళ్ళపై నిలబడ గలుగుతారనేది సత్యమే అయినా అంత సదుద్దేశంతోనే నిర్దేశకులు సహాయం చెయ్యటం మానేస్తున్నారా? అన్నది ప్రశ్న.

*- ఆంధ్రసచిత్ర వారపత్రిక - '70*

★